


# మన జనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక


MJP NEWS TELUGU

సంపుటి : 6 | సంచిక : 100 | పేజీలు : 8 | వెల : రూ.2/- గురువారం 07 మే 2026 వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం

### - 17వ ఎస్ఐపీబీ సమావేశంలో చంద్రబాబు



**అమరావతి,మన జనప్రగతి మే 06:**రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు 17వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు ఆమోదం తెలిపింది. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన 17వ ఎస్ఐపీబీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించింది. ఈ ప్రాజెక్టులు 39 వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించనున్నాయి. విశాఖపట్నంలో రిలయన్స్ సంస్థ రూ.1 లక్ష కోట్లతో భారీ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది. సత్యసాయి జిల్లాలో రూ.51 వేల కోట్లతో సోలార్ పవర్ ప్లాంట్‌ను మిగతా2లో...




## శ్రీసిటీలో క్యారియర్ ఏసీ పరిశ్రమ

### - శంకుస్థాపన చేసిన మంత్రి లోకేశ్

**తిరుపతి,మన జనప్రగతి మే 06:** శ్రీసిటీలో క్యారియర్ ఏసీ పరిశ్రమకు మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. క్యారియర్ ఏసీ తయారీ కేంద్రం భారతదేశంలోని తమ ఉత్పత్తుల్లో 80 శాతం శ్రీసిటీలో నుంచి సరఫరా చేయబోతోందని తెలిపారు. కుటుంబంలో తల్లి ప్రేమ ముందు.. ఓ తండ్రి చేసే త్యాగాలు పిల్లల కంటికి తెలియదన్నారు. అలాగే ముఖ్యమంత్రిగా చంద్రబాబు రాష్ట్ర ఆర్థిక వృద్ధికి చేసిన కృషిని కొందరు సరిగ్గా అర్థం చేసుకోరని.. అయినా కూడా ఆయన అనుకున్నది మిగతా2లో...



## ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నం నెరవేరింది

### రైల్వే జోన్ ఏర్పాటు అంశంపై బిజెపి చీఫ్ మాధవ్

**విశాఖపట్నం,మన జనప్రగతి మే 06:** ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నం నెరవేరిందని, ఈ ఘనత ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు దక్కుతుందని ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ అన్నారు. విశాఖపట్నం కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు అంశంపై ఆయన

మిగతా2లో...

## తిరుమలలో పరిపాలనా భవన నిర్మాణం

**● టీటీడీ ఆస్థాన విద్వాంసురాలిగా శోభరాజ్ ● టిటిడి పాలకమండలి కీలక నిర్ణయాలు**



**తిరుమల,మన జనప్రగతి మే 06:**తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలకమండలి తాజాగా కీలక నిర్ణయాలు తీసుకుంది. భక్తుల సౌకర్యాలు, ఆలయాల అభివృద్ధి, ఉద్యోగుల సంక్షేమం లక్ష్యంగా పలు అంశాలపై ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయాలు తిరుమలతో పాటు ఇతర ప్రాంతాల్లో కూడా ప్రభావం చూపనున్నాయి. తిరుమలలోని వరహస్వామి గెస్ట్ హౌస్-1 అభివృద్ధి పనుల కోసం రూ.3.6 కోట్ల నిధులు కేటాయించారు. అలాగే తిరుమలలో పరిపాలన భవనం నిర్మాణానికి కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అలిపిరి వద్ద బస్సుల తనిఖీ కోసం రూ.4.5 కోట్లతో షెడ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సాంస్కృతిక రంగంలో భాగంగా ప్రముఖ మిగతా2లో...

## విజయ్‌కు తమిళ గవర్నర్ షాక్

- 118 మంది ఎమ్మెల్యే మద్దతు తప్పనిసరి
- మద్దతు ఇచ్చే పార్టీల లేఖలు అవసరమని సూచన
- పూర్తి మెజార్టీ ఉంటే ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం
- గవర్నర్ విశ్వనాథ్‌తో భేటీలో విజయ్‌కు స్పష్టీకరణ
- నేటి ప్రమాణ స్వీకారంపై సందిగ్ధత

**చెన్నై,మన జనప్రగతి మే 06:** టీవీకే చీఫ్ విజయ్‌కు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ షాక్ ఇచ్చారు. తగినంత మెజారిటీ చూపించలేకపోవడంతో విజయ్ ప్రభుత్వం ఏర్పాటుకు గవర్నర్ అనుమతి నిరాకరించారు. ప్రభుత్వం ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేలు తప్పనిసరని గవర్నర్ స్పష్టం చేశారు. దీంతో తక్షణం ప్రభుత్వం ఏర్పాటుపై సస్పెన్స్ కొనసాగుతోంది. మద్దతు ఎమ్మెల్యేలు లేదా పార్టీల జాబితా సమర్పించాలని, అప్పుడే ప్రభుత్వ ఏర్పాటుకు



ఆహ్వానం పలుకుతామని స్పష్టం చేసినట్లు సమాచారం. బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను విజయ్ కలుసుకున్నారు. కాంగ్రెస్ మద్దతు ఇచ్చేందుకు ముందుకు వచ్చిందని, పలు పార్టీలుకూడా తమతో చేతులు కలుపనున్నాయని గవర్నర్‌కు విజయ్ వివరించినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం అనంతరం అసెంబ్లీలో బలపరీక్ష నిరూపించుకుంటానని విజయ్ వివరించినట్లు తెలుస్తోంది. అయితే విజయ్ వివరణతో మిగతా2లో...



## నేడు బీహార్ కేబినేట్ విస్తరణ

### - మంత్రివర్గంలో నితీశ్ తనయుడు నిశాంత్

**పాట్నా,మన జనప్రగతి మే 06:** బీహార్‌లో ఈనెల 7న గురువారం కీలక మంత్రివర్గ విస్తరణ జరుగనుంది. గాంధీ మైదానంలో పెద్దఎత్తున ప్రమాణస్వీకార కార్యాక్రమానికి ఏర్పాట్లు జరుగుతున్నారు. బిహార్ మాజీ మిగతా2లో...

## ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యం.. విధులకు ఏళ్లుగా గౌర్హాజరు

### 51 మందిపై వేటు వేసిన ప్రభుత్వం

### క్రమశిక్షణా రాహిత్యాన్ని ఉపేక్షించేది లేదన్న మంత్రి సత్యకుమార్



**అమరావతి,మన జనప్రగతి మే 06:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్రమశిక్షణ, రోగులకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. అనధికారికంగా విధులకు గైర్హాజరవుతున్న వైద్యుల పట్ల రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతారాహిత్యాన్ని ఎంతమాత్రం సహించబోమని స్పష్టం చేస్తూ.. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోని 51 మంది వైద్యులను

మిగతా2లో...

## సర్ ప్రక్రియలో అప్రమత్తంగా ఉండాలి

**● మన ఓట్లను తొలగించేలా చంద్రబాబు దళం కుట్ర ● ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో సిద్ధం కావాలి ● పార్టీ శ్రేణులకు సజ్జల హెచ్చరికలు**



**అమరావతి,మన జనప్రగతి మే 06:** ఎస్ఐఆర్ ఓటర్ల జాబితా సవరణపై మరింత అప్రమత్తంగా ఉండాలని.. 175 అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తలు దీనిపై మరింత అవగాహన పెంచుకోవాలని సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. అందుకు అవసరమైన టెక్నికల్ నాలెడ్జ్‌ను పెంచుకోవాలని సూచించారు. 'ఎస్ఐఆర్ పేరుతో ఇటీవల జరిగిన ఎన్నికల్లో మిగతా2లో...

## ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీ

### ప్రభుత్వం మౌనంగా ఉండడం సరికాదు: రౌండ్ టేబులు సమావేశంలో కవిత

**హైదరాబాద్,మన జనప్రగతి మే 06:** ప్రైవేట్ స్కూళ్ల ఫీజు దోపిడీపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత ప్రశ్నించారు. విద్య ద్వారానే సమానత్వం, స్వేచ్ఛ సాధ్యమని కవిత అన్నారు. 'నాణ్యమైన విద్య - ఫీజుల నియంత్రణ'పై ఆమె రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉచిత విద్య, వైద్యం ప్రభుత్వాల భాధ్యతేనని నమ్మిన ప్రభుత్వాలు ఉండాలన్నారు. ఫీజులు ఎంత పెంచినా నిమ్మకు నీరెత్తినట్లు ఉంటామంటే కుదరదని చెప్పారు. ఇప్పుడున్న చాలా విద్యాసంస్థలు వ్యాపార ధోరణితో ఉన్నవేవపి, వాటిలో రాజకీయ నాయకులకు సంబంధించినవే ఎక్కువగా ఉన్నాయన్నారు. మిగతా2లో...



## భద్రతా సలహాదారుగా శివధర్ రెడ్డి బాధ్యతల స్వీకారం

### - గవర్నర్‌తో మర్యాదపూర్వక భేటీ

**హైదరాబాద్,మన జనప్రగతి మే 06:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భద్రతా సలహాదారుగా రిటైర్డ్ ఐపిఎస్ అధికారి, మాజీ డిజిపి బి. శివధర్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ లోని 8 వ ఫ్లోర్ లో ఈ బాధ్యతలను చేపట్టారు. మిగతా2లో...



మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
07 -05-2026

# తిరుమలలో పరిపాలనా భవన నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

కళాకారిణి శోభరాజ్‌ను టీటీడీ ఆస్థాన విద్వాంసురాలిగా నియమించారు. ఇక సత్యసాయి జిల్లా లేపాక్షిలో కళ్యాణ మండపం నిర్మాణానికి కూడా ఆమోదం లభించింది. టీటీడీ ఉద్యోగుల సంక్షేమం కోసం పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు దర్శనం, లడ్డు కార్డులు జారీ చేయాలని నిర్ణయించారు. అలాగే ఉద్యోగుల హెల్త్ స్కీం రీయింబర్స్‌మెంట్ పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచారు. ఉద్యోగుల ఇంటి స్థలాల అభివృద్ధి పనులపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు. ఆలయాలకు ధూప, దీప, నైవేద్యం కోసం ఇచ్చే నిధులను రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు పెంచుతూ టీటీడీ పాలకమండలి నిర్ణయం తీసుకుంది. భక్తుల ఆధ్యాత్మిక అనుభూతిని పెంచేందుకు తిరుమలలో 51 ప్రాంతాలకు ఆధ్యాత్మిక పేర్లు పెట్టాలని నిర్ణయించారు. ఇక వేసవి రద్దీని దృష్టిలో ఉంచుకుని మే 1 నుంచి జూలై 15 వరకు సిఫార్సు లేఖలను స్వీకరించకూడదని టీటీడీ నిర్ణయించింది. అదనంగా ఖమ్మంలో 20 ఎకరాల్లో టీటీడీ ఆలయ నిర్మాణానికి ఆమోదం తెలిపింది. తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూరులో ఆలయ నిర్మాణానికి ఇచ్చిన 20 ఎకరాల భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని నిర్ణయించారు.

# విజయ్‌కు తమిళ గవర్నర్ షాక్

(మొదటి పేజీ తరువాయి)

గవర్నర్ సంతృప్తి చెందలేదని తెలుస్తోంది. ప్రభుత్వం ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేల బలం అవసరం కాగా, కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలిసి టీవీకే వద్ద ప్రస్తుతం 112 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. విజయ్ రెండు సీట్లలో గెలవడంతో ఒక సీటును వదులుకోవడం అనివార్యం. దీంతో టీవీకే చేతిలో 107 మంది సభ్యుల బలం మాత్రమే ఉన్నట్టయింది. కాంగ్రెస్ బలం కూడా కలిపితే టీవీకే బల నిరూపణకు మరో 6 మంది ఎమ్మెల్యేలు అవసరం. ఐడీఎంకే 47 సీట్లలో గెలవగా, అందులోని ఒకవర్గం టీవీకే వైపు మొగ్గుచూపుతోంది. పీఎంకే-4, ఐయూఎంఎల్-2, సీపీఐ-2, సీపీఎం-2, డీఎండీకే, ఐఎంఎంకే చెరో సీటు కలిగి ఉన్నాయి. టీవీకేకు చిన్న పార్టీల నుంచి మద్దతు లభించే అవకాశాలు బలంగానే ఉన్నాయి. అయితే అధికారికంగా మద్దతు ఇస్తేనే సంఖ్యాబలాన్ని విజయ్ చూపించుకునే అవకాశం ఉంటుంది. టీవీకే అధినేత విజయ్ తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు రాజ్‌భవన్‌లో కలుసుకున్నారు. ప్రభుత్వం ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. కాగా, తమిళనాడు కొత్త ముఖ్యమంత్రిగా 7న విజయ్ ప్రమాణస్వీకారం చేయడానికి ఏర్పాట్లు కూడా చేసుకున్నారు.. మంచి ముహూర్తం కావడంతో ఉదయం 10 గంటల నుంచి 11.15 గంటల మధ్య విజయ్ ప్రమాణస్వీకారం చేయ నున్నారు. ఇందు కోసం చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం లో పూర్తి స్థాయి ఏర్పాట్లు చేస్తున్నారు. సుమా రు 5,000 సీట్ల సామర్థ్యం ఉన్న ఈ స్టేడియంలో ఏ ర్పాట్లు పూర్తి చేసి ఉదయం గురువారం 6 గంటల కల్లా సిద్ధం చేయనున్నట్టు టీవికే వర్గాలు చెబుతు న్నా రు. ప్రభుత్వ ప్రమాణస్వీకార కార్యక్రమం కావడం తో స్టేడియం వద్ద పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

# ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యం.. విధులకు ఏళ్లుగా గౌర్హాజరు

(మొదటి పేజీ తరువాయి)

విధుల నుంచి శాశ్వతంగా తొలగిస్తున్నట్లు ప్రకటించారు. శాశ్వత ఉద్వాసనకు గురైన 51 మందిలో బోధనాసుపత్రులకు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్లు 8 మంది, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 41 మంది, ఇద్దరు ట్యూటర్లు ఉన్నారు. వీరితో పాటు మరో ముగ్గురు ప్రొఫెసర్లపై త్వరలోనే కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. తొలగించిన వారిలో కొందరు ఏడేళ్ల నుంచి, మరికొందరు ఆరేళ్ల నుంచి విధులకు దూరంగా ఉంటూ సొంత వ్యాపకాలు సాగిస్తున్నారు. ఏపీ సివిల్ సర్వీసెస్ (కాండక్ట్) రూల్స్-1964 ప్రకారం ఏడాదికి మించి విధులకు గైర్హాజరైతే రాజీనామా చేసినట్లుగానే పరిగణించే అధికారం ప్రభుత్వానికి ఉంది. నిబంధనల మేరకు వీరికి ముందస్తుగా షోకాజ్ నోటీసులు జారీ చేసి, వివరణ ఇవ్వడానికి తగిన సమయం ఇచ్చినప్పటికీ ఎటువంటి స్పందన లేకపోవడంతో ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. ఏడాదిలోపు గైర్హాజరీలో ఉన్న మరో 33 మంది వైద్యులు ఇందులో ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు, 31 అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఛార్జిమెమోలు జారీ చేశారు. నిర్ణీత గడువులోగా విధుల్లో చేరని పక్షంలో వీరిని కూడా విధుల నుంచి తొలగించనున్నట్లు హెచ్చరించారు. ప్రభుత్వ హెచ్చరికలతో ఇప్పటికే 11 మంది వైద్యులు తిరిగి విధుల్లో చేరారు. వైద్యుల బాధ్యతారాహిత్యాన్ని ఏమాత్రం ఉపేక్షించే ప్రసక్తే లేదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. . త్వరలోనే మరో ముగ్గురు ప్రొఫెసర్లపై కూడా ఇటువంటి చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. విధులకు గైర్హాజరైన వారిలో కాకుండా, మరో 33 మంది వైద్యులకు ప్రభుత్వం ఛార్జిమెమోలు జారీ చేసింది. వైద్య సేవలకు ఎటువంటి ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతోనే ఈ కఠిన నిర్ణయాలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

# సర్ ప్రక్రియలో అప్రమత్తంగా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

ఒక్కో రాష్ట్రంలో 90 లక్షలకు పైగాలో తొలగించడం జరిగింది. మనం వైఎస్సార్సీపీ ఓటర్లు, సానుభూతి పరుల ఓట్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలి.. ఒకసారి ఓటు తొలగిస్తే తిరిగి చేర్చడం ఇబ్బందికరం అని సజ్జల పేర్కొన్నారు. వైఎస్సార్సీపీ కీలక నేతలతో సజ్జల రామకృష్ణారెడ్డి బుధవారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్లు, జిల్లా పార్టీ అధ్యకులు, ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు (కో-ఆర్డినేషన్), రాష్ట్ర కార్యదర్శులు (కో-ఆర్డినేషన్) మెంబర్లతో ఆయన సమావేశమయ్యారు. సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ఓటర్లపై చంద్రబాబు, ఆయన టీమ్ ప్రత్యేకంగా దృష్టిపెట్టారు. బీఎల్ఓలపై తీవ్ర ఒత్తిడి ఉంటుంది. కావున మన తరుపున ఉండే బీఎల్ఏలు కూడా సమర్థుడై, బీఎల్వోతో సమన్వయం చేసుకోవాలి. మనం ఎస్ఐఆర్‌ను అవకాశంగా తీసుకుని మన ఓటర్లను కాపాడుకోవాలి. బీఎల్ఓలు ఇప్పటికే మ్యాపింగ్ చేశారు.. కావున మనం ఏర్పాటుచేసుకున్న బీఎల్ఏలు కూడా అందుకు సన్నద్ధంగా ఉండాలి. ఎస్ఐఆర్ మొదలయ్యేలోగా మనం అందుకు అవసరమైన విధంగా సిద్దంగా ఉండాలన్నారు. బీఎల్ఏలు సాంకేతికపరంగా ఎక్స్‌పర్ట్ అయి ఉండి అందరితో సమన్వయం చేసుకోవాలి. పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ సిద్దంగా ఉంటుంది. బీఎల్ఏలకు అవసరమైన ఓరియెంటేషన్ కూడా ఇద్దాం. మనం నిరంతరం దీనిపై దృష్టిపెడితే సార్వత్రిక ఎన్నికలను సులువుగా గెలవచ్చు. అంతేకాక స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరిగినా మనం విజయం సాధించవచ్చు. ఎస్ఐఆర్ పై చర్చ అనంతరం రాష్ట్రంలో రైతులకు సంబంధించి ఈ వారంలో వచ్చేవారం ఆసుపత్రుల సందర్శన, ఆరోగ్యశ్రీ నిర్వీర్యం వంటి కార్యక్రమాలను మనం షెడ్యూల్ చేసుకున్నాం. అందరితో సమన్వయం చేసుకుని ముందుకెళ్ళాలి. కమిటీల వెరిఫికేషన్ ఇంకా కొన్ని ప్రాంతాల్లో ఆలస్యంగా నడుస్తోంది, మీరు మరింత వేగవంతం చేయాలి. అందుకు అవసరమైన సపోర్టింగ్ సిస్టమ్స్ ఏర్పాటు చేసుకోవాలి. మనకు సంబంధించి ప్రతి కార్యక్రమం కూడా మీడియాలో, సోషల్ మీడియాలో హైలెట్ చేసుకోవాలి. మన ప్రభుత్వంలో ప్రజలకు జరిగిన మంచి, కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ప్రజల్లో ఎండగట్టాలి. చంద్రబాబు ప్రభుత్వ దోపిడీ, ఉన్మాదం, అవినీతి, రెడ్ బుక్ పాలనపై కూడా నియోజకవర్గాల్లో మీరు కార్యక్రమాల ప్రణాళిక రూపొందించుకోవాలి. ఈ విషయంలో జిల్లా అధ్యక్షులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో మాట్లాడిన కన్నబాబు, లేళ్ళ అప్పిరెడ్డి, వరికూటి అశోక్ బాబు, అబ్బయ్య చౌదరి, కొరుముట్ల శ్రీనివాసులు, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, మల్లాది విష్ణు ఎస్ఐఆర్‌పై తమకు ఉన్న అవగాహన, అనుమానాలపై చర్చించి పార్టీ క్యాడర్ అంతా అప్రమత్తంగా ఉండాలని, ఎస్ఐఆర్ పూర్తయ్యేవరకు ఏ మాత్రం అజాగ్రత్త లేకుండా ప్రతి ఒక్కరూ ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు.

# బందరు చరిత్ర తిరగరాసేలా అభివృద్ధి

## పట్టణంలో అన్ని ప్రాంతాలకు మంచినీటి సరఫరా

## మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టీకరణ



**మచిలీపట్నం,మన జనప్రగతి మే 06:** బందరు చరిత్ర తిరగరాసేలా అభివృద్ధి చేసి చూపిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. మచిలీపట్నంలోని అన్ని ప్రాంతాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. గత ఐదేళ్లు మున్సిపాలిటీ అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. బుధవారం బందరులో తాగునీటి పైపులైన్లు, డీడబ్ల్యూఎమ్ రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ.. బందరులోని ప్రతి ప్రాంతానికి రోడ్లు, తాగునీటి సౌకర్యాలు అందించేలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఆరోపణలు, విమర్శలు తప్ప మాజీ మంత్రి పేర్నినానికి బందరు అభివృద్ధి పట్టదని విమర్శించారు. అభివృద్ధి పనులను అడ్డుకుంటే తొక్కి పడేస్తామని కొల్లు రవీంద్ర వార్నింగ్ ఇచ్చారు. గతంలో రోడ్లను కూడా పట్టించుకోలేదని వైసీపీపై మంత్రి విరుచుకుపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంతలు లేని మచిలీపట్నాన్ని సాకారం చేశామన్నారు. తాగునీటి సమస్యల పరిష్కారానికి రూ.28 లక్షల వ్యయంతో పనులు ప్రారంభించామని తెలిపారు. గతంలో ఎంపీగా పని చేసిన కొనకళ్ల నారాయణ రావు, ప్రస్తుత ఎంపీ వల్లభనేని బాలశౌరి కృషితో కేంద్రం నుంచి నిధులు వచ్చాయని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా నిధులు సమకూర్చి మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఇళ్ల నిర్మాణ ప్రాంతంలో ఇనుము దొంగిలించేశారంటూ పేర్ని నాని చేసిన వ్యాఖ్యలపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు ఆరోపణలు చేస్తూ.. ఆధారాలు చూపించమంటే తేలుకుట్టిన దొంగల్లా పారిపోతున్నారని మండిపడ్డారు. మార్కెట్ యార్డులో పెట్టిన ఇనుము పాడైపోతుంటే.. దాన్ని వేరే ప్రాంతంలో ఇళ్ల నిర్మాణం కోసం వినియోగించడం లో తప్పేముందని ప్రశ్నించారు. తప్పు జరిగితే ఫిర్యాదు చేయాలని.. కానీ అధికారులను బెదిరించడం దుర్మార్గమని మండిపడ్డారు. 2014-19 మధ్య పేదల కోసం నిర్మించిన టిడ్కో ఇళ్లను గత ఐదేళ్లు లబ్దిదారులకు అందకుండా పాడుబెట్టారని మంత్రి ఆరోపించారు. కర్రగ్రహారం లే అవుట్ పేరుతో వైసీపీ నాయకులు పేదల భూములను తక్కువ ధరకు కొని ప్రభుత్వానికి అధిక ధరకు అమ్మి లాభాలు పొందారని వ్యాఖ్యానించారు. ఇళ్లు కట్టుకోవడానికి కూడా పనికిరాని ప్రాంతాల్లో భూ కేటాయింపుల పేరుతో దోచుకున్నారన్ని ÷ర్ అయ్యారు. ఆ లే అవుట్లలో రోడ్లు, తాగునీటి సౌకర్యాలు ఎందుకు ఏర్పాటు చేయలేదని పేర్ని నాని, జగన్ రెడ్డిని ప్రశ్నించారు. పేర్నినాని రోజూ మీడియా ముందుకు వచ్చి చెత్త ఆరోపణలు చేయడం తప్ప అభివృద్ధి కోసం ఒక్క ఆలోచన కూడా చేయలేదని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు.

# రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేయడానికి గ్రీన్ సిగ్నల్ లభించింది. కడపలో అదానీ సంస్థ రూ.12 వేల కోట్లతో హైడ్రో ఎనర్జీ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టును చేపట్టనుంది. తిరుపతిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ రూ.2,500 కోట్లతో మోటర్ సైకిల్ తయారీ పరిశ్రమను స్థాపించనుంది. ఈ ప్రాజెక్టులకు నిర్దేశిత గడువుకు ముందే అనుమతులతో ఓ బ్రాండ్ సృష్టిద్దామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

# ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నం నెరవేరింది

(మొదటి పేజీ తరువాయి)

స్పందించారు. విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన మీడియా కార్యక్రమంలో ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ మాట్లాడారు. ఈ రైల్వే జోన్ సాధన కోసం బీజేపీ ఎన్నో పోరాటాలు చేసిందని, విభజన చట్టంలో ఈ అంశంపై స్పష్టత లేనప్పటికీ కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ.. 'రాష్ట్ర విభజన చట్టంలో ప్రత్యేక రైల్వే జోన్ ఇవ్వాలని స్పష్టంగా పేర్కొనలేదు.. కేవలం ఈ అంశాన్ని పరిశీలించాలని మాత్రమే ఉంది. కానీ, 2019 ఎన్నికలకు ముందే ఈ జోన్‌ను ప్రకటించాం.. ఇప్పుడు ఆ కల నెరవేరింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో రైల్వే జోన్ ఏర్పాటుకు అవసరమైన భూమిని అందించడంలో తీవ్ర జాప్యం జరిగింది. ఈ సుదీర్ఘ పక్రియలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రతిష్టాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ జోన్ సాధనలో ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా కీలక పాత్ర పోషించారు. వీరందరికీ కృతజ్ఞతలు. ఒకప్పుడు పీయూష్ గోయల్ మాట్లాడుతూ తెలంగాణ ఇవ్వడం సులువు, కానీ రైల్వే జోన్ ఇవ్వడం కష్టం అని అన్నారు. . అమరావతి రాజధానికి ఏ విధంగా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారో, అదే తరహాలో రైల్వే జోన్‌కు కూడా గెజిట్ నోటిఫికేషన్ వచ్చింది. రైల్వే జోన్ విషయంలో ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయి. ప్రభుత్వం మంచి చేసినా వైఎస్సార్సీపీ, వామపక్షాలు గుర్తించడం లేదు. 10వ తేదీ తర్వాత రాజకీయాల్లో మార్పులు రాబోతున్నాయి. తెలంగాణలో ప్రధాని నరేంద్ర మోదీ ర్యాలీకి సన్నాహాలు చేస్తున్నాం. త్వరలోనే తెలంగాణ, కర్ణాటక రాష్టాల్లో బీజేపీ ప్రభుత్వాలు ఏర్పడతాయి' అని అన్నారు.

# శ్రీసిటీలో క్యారియర్ ఏసీ పరిశ్రమ

(మొదటి పేజీ తరువాయి)

సాధిస్తారని చెప్పుకొచ్చారు. పారిశ్రామికవేత్తలకు ఏ రకమైన సేవలైనా ఒక్క వాట్సాప్ మేసేజ్‌తో చేయటానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. శ్రీసిటీలో 70 వేల మంది ఉద్యోగుల్లో 35 వేల మంది మహిళలు ఉన్నారని.. శ్రీశక్తికి ఇది నిదర్శనమన్నారు. శ్రీసిటీలోని పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. ఈ నెలాఖరులోపు ఏఐ ద్వారా నైపుణ్యం ఉన్న వారికి ఉద్యోగాల కల్పనకు శ్రీకారం చుట్టబోతున్నామని లోకేశ్ వెల్లడించారు. శ్రీసిటీలో క్యారియర్ గ్లోబల్ సంస్థ వెయ్యి కోట్లు పెట్టుబడి పెట్టనుంది. తద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 3 వేల మందికి ఉపాధి లభించనుంది. శ్రీసిటీ పరిధిలోని ఆరూరు వద్ద ఈ పరిశ్రమకు 40 ఎకరాల స్థలం కేటాయించారు. ఒకటి, రెండు టన్నుల సామర్థ్యం కలిగిన ఏసీలే కాకుండా భారీ పారిశ్రామిక సముదాయాలకు వినియోగించే 1000 టన్నుల నుంచి 5000 టన్నుల సామర్థ్యం కలిగిన కూలింగ్ సిస్టమ్స్‌ను క్యారియర్ సంస్థ తయారుచేయనుంది. ఉదయం సత్యవేడు నియోజకవర్గం శ్రీసిటీ పారిశ్రామికవాడకు చేరుకున్న మంత్రి లోకేశ్‌కు టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ప్రతిఒక్కరినీ మంత్రి ఆత్మీయంగా పలకరించి ఫొటోలు దిగారు. శ్రీసిటీలో శంకుస్థాపన అనంతరం మంత్రి లోకేశ్ తిరిగి ఉండవల్లికి వెళ్లనున్నారు.

# నేడు బిహార్ కేబినేట్ విస్తరణ

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తనయుడు నిశాంత్ కుమార్ మంత్రివర్గంలో చేరే అవకాశం ఉంది. జేడీయూ నేతలు మంగళవారం రాత్రి జరిపిన సమావేశంలో ప్రభుత్వంలో చేరాలని నిశాంత్‌ను ఒప్పించినట్టు తెలుస్తోంది. ఢిల్లీ నుంచి పాట్నా వచ్చిన కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ సహా, జేడీయూ నేతలు ప్రస్తుతం 7 సర్క్యులర్ రోడ్డులోని నితీశ్ కుమార్ నివాసంలో సమావేశం జరిపారు. ఈ సమావేశంలో మంత్రుల తుది జాబితాను ఆమోదించనున్నట్టు తెలుస్తోంది. చాలాకాలంగా యాక్టివ్ పాలిటిక్స్‌కు దూరంగా ఉంటున్న నిశాంత్ ప్రభుత్వంలో చేరేందుకు కూడా తొలుత నిరాకరించారు. అయితే మంగళవారంనాడు జరిగిన జేడీయూ సమావేశంలో సీనియర్ నేతలు ఆయనను ప్రభుత్వంలో చేరేందుకు ఒప్పించినట్టు తెలిసింది. ప్రభుత్వంలో ఆయన చేరడం పార్టీకి, రాష్ట్రానికి కూడా కీలకమని నచ్చచెప్పినట్టు సమాచారం. నిశాంత్ ప్రస్తుతం ప్రజాసమస్యలు తెలుసుకునేందుకు, నితీశ్ హయాంలో జరిగిన అభివృద్ధి పనుల ఫీడ్‌బ్యాక్‌ను సేకరించేందుకు పలు జిల్లాల్లో 'బిహార్ గుడ్‌విల్ యాత్ర' జరుపుతున్నారు. ఆయన గత మే 8న లాంఛనంగా జేడీయూలో చేరారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్ ఝా ఆయనకు సభ్యత్వాన్ని అందజేశారు. కాగా, బిహార్ మంత్రివర్గ విస్తరణలో 27 మందికి చేటు కల్పించనున్నారు. బీజేపీ నుంచి 12 మంది, జేడీయూ నుంచి 11 మంది, ఎల్‌జేపీ (రామ్‌విలాస్) నుంచి ఇద్దరు, హెచ్ఏఎం, ఆర్ఎల్ఎస్పీ నుంచి చెరొకరికి మంత్రివర్గంలో చోటు కల్పించనున్నారు.

# ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీ

(మొదటి పేజీ తరువాయి)

రాజకీయ నాయకులకు విద్యాసంస్థలు ఉండటమనేది సరైనదేనా మనం ఆలోచించాలి. అదే విధంగా ఫీజుల దోపిడీకి ఇప్పుడే పరిష్కారం కావాలని అన్నారు. తెలంగాణ వచ్చాక ఫీజుల నియంత్రణ కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం తిరుపతిరావు కమిషన్ వేసింది. ఆ కమిషన్ అధ్యయనం చేసి రిపోర్టు కూడా ఇచ్చింది. కానీ ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో బీఆర్ఎస్ సర్కార్ ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. గురుకులాలు ఏర్పాటు చేశామని.. ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీని పట్టించుకోబోమంటే కుదరదు. మన రాష్ట్రంలో 64 లక్షల మంది విద్యార్థులు ఉంటే 65 నుంచి 75 శాతం వరకు ప్రైవేటు స్కూళ్లలోనే చదువుతున్నారు. ఈ ప్రభుత్వం కచ్చితంగా కార్పొరేట్ స్కూళ్ల దోపిడీని నియంత్రించాలి. ఇందుకు సంబంధించిన జీవోను తక్షణమే ఇవ్వాలి. గతేడాదితో పోలిస్తే ఒక్క రూపాయి కూడా ఫీజు పెంచకుండా చర్యలు తీసుకోవాలి. ఈ ముఖ్యమంత్రి ప్రైవేట్ స్కూల్ ఓపెనింగ్‌లకు వెళ్తూ ఏం సందేశం ఇస్తున్నట్లు ప్రైవేట్ విద్యాసంస్థలను దోపిడీని ముఖ్యమంత్రే ప్రోత్సహిస్తున్నట్లా అని కవిత ప్రశ్నించారు.

# భద్రతా సలహాదారుగా శివధర్ రెడ్డి బాధ్యతల స్వీకారం

(మొదటి పేజీ తరువాయి)

శివధర్ రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, అంతర్గత భద్రత, నేర నియంత్రణ, మాదకద్రవ్యాల (నార్కోటిక్స్) నిర్మూలన మరియు రహదారి భద్రత వంటి కీలక అంశాల్లో ఆయన తన అనుభవాలతో సాఫీగా కొనసాగేందుకు సహకరించనున్నారు. ఐపిఎస్ అధికారిగా 32 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం ముఖ్యంగా, అంతర్గత భద్రత, మావోయిస్టులను జనజీవన స్రవంతిలో చేర్చే కార్యకలాపాలలో క్షేత్రస్థాయిలో విశేష సేవలందించారు. గతంలో ఇంటిలిజెన్స్ విభాగంతో పాటు పలు కీలక శాఖల్లో సమర్థవంతంగా పనిచేసిన అనుభవం ఉంది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం శివధర్ రెడ్డి రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్సర్ శివప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు. పదవి బాధ్యతలు స్వీకరించిన అనంతరం బి.శివధర్ రెడ్డిని ఆయన కార్యాలయంలో పలువురు ఐపిఎస్ అధికారులు కలిసి అభినందనలు తెలిపారు. హైదరాబాద్ సిపి వి.సి. సజ్జనార్, ఇంటెలిజెన్స్ అడిషనల్ డిజిపి శ్రీ విజయ్ కుమార్, మల్కాజిగిరి సిపి శ్రీమతి బి. సుమతి, ఐ జి పి (పీ అండ్ ఎల్) గజరావు భూపాల్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు. హోం శాఖ, పోలీసు విభాగానికి చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

# వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోండి: డాక్టర్ సి.వాసు రెడ్డి

● టైక్వాండో క్యాంపు ప్రారంభిచిన వి.ఆర్.హాస్పిటల్ అధినేత డాక్టర్ సి.వాసు రెడ్డి





**కర్నూల్ బ్యూరో మన జనప్రగతి మే 06:-**ఈ వేసవికాలంలో విద్యార్థులు బయట తిరిగి ఆరోగ్యాలు పాడు చేసుకోకుండా వేసవి క్రీడా శిక్షణ కేంద్రాలలో ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ శ్రీ వాసురెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని కిడ్సవర్డ్ పార్కు లో తైక్వాండో వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. టైక్వాండో మార్షల్ ఆర్ట్స్ వల్ల ఆత్మరక్షణ, క్రమశిక్షణ అలబడుతుందని క్రీడ వైపు అందరూ ఆసక్తి చూపి క్రీడల్లో నైపుణ్యం నేర్చుకోవాలన్నారు. మంచి క్రీడాకారుకి జాతీయ జిల్లా రాష్ట్ర పథకాలు సాధించాలని క్రీడల్లో ఉజ్వల భవిష్యత్తు అలవాటుతుందని తెలియజేశారు. మురళీధర్ రెడ్డి క్రీడదాత ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచి క్రీడల్లో రోజు సాధన చేస్తే ఆరోగ్యం బాగుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ శిక్షకులు టి.వెంకటేశ్వర్లు, అజయ్, తేజ, తిలక్, అఖిల్, సాయి కృష్ణ, నందిని, అశ్విని, శ్రీ లలిత, శ్రీహరి, రుషి, బద్రి, శివమణి తదితరులు పాల్గొన్నారు.

# బ్యాట్ పట్టి టోర్నమెంట్‌ను ప్రారంభించిన నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి





**కలికిరి మన జనప్రగతి మే 06:-**మార్నింగ్ ఎలెవెన్స్ క్రికెట్ క్లబ్ మద్దతుతో నిర్వహిస్తున్న కలికిరి ప్రీమియర్ లీగ్ (కె.పీ.ఎల్) సీజన్2 బుధవారం కలికిరిలో ఘనంగా ప్రారంభమైంది. గ్రామీణ స్థాయి క్రికెట్ ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో ప్రారంభమైన ఈ లీగ్ రెండో సీజన్‌లో మరింత ఉత్సాహంగా కొనసాగుతోంది.ఈ క్రికెట్ లీగ్‌ను నల్లారి సోదరులు సంయుక్త ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మరియు బీజేపీ జాతీయ నాయకులు నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ప్రారంభోత్సవంలో వారు బ్యాటింగ్ చేసి టోర్నమెంట్‌ను ఆరంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి క్రీడా కార్యక్రమాలు యువతలో ప్రతిభను వెలికితీసి, క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. కలికిరి ప్రీమియర్ లీగ్ వంటి వేదికలు స్థానిక ఆటగాళ్లకు మంచి అవకాశాలు కల్పిస్తున్నాయని అభినందించారు.ఈ లీగ్‌లో ఆల్ఫా మావెరిక్స్, డేర్‌డెవిల్స్, ఫాల్కన్ రైజర్స్, లెగసీ ఎలెవెన్స్, రాయలసీమ రెడ్‌బుల్స్, రాయల్ వారియర్స్, జేసీసీ బ్యాడ్జర్స్ జట్లు పాల్గొంటున్నాయి.టి -10 హార్డ్ టెన్నిస్ బాల్ ఫార్మాట్‌లో జరిగే ఈ పోటీలు ప్రేక్షకులకు ఉత్కంఠభరిత అనుభూతిని అందించనున్నాయి.కలికిరి ప్రీమియర్ లీగ్ కేవలం ఒక టోర్నమెంట్ మాత్రమే కాకుండా, స్థానిక ప్రతిభకు ఒక వేదికగా నిలుస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో క్రికెట్ అభివృద్ధికి దోహదపడుతోంది.ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షాబుద్దీన్, యువ నాయకులు శిబ్బాల దినకర్, సీనియర్ క్రికెట్ క్రీడాకారుడు డాక్టర్ మహి స్వామి, తెలుగుదేశం మరియు బీజేపీ నాయకులు, టోర్నమెంట్ నిర్వాహకులు మసూద్, జవీద్, సిరాజ్, అలీ బాబు, పాల్గొంటున్న జట్ల క్రీడాకారులు మరియు భారీ సంఖ్యలో క్రికెట్ అభిమానులు పాల్గొన్నారు.

# సిపేట్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం: డా.సిహెచ్ శేఖర్.



**పత్తికొండ మన జన ప్రగతి మే 06:**సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (సిపేట్)లో డిప్లొమా మరియు పీజీ డిప్లొమా కోర్సులకై అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సంస్థ డైరెక్టర్ హెడ్ డా. సిహెచ్ శేఖర్ తెలిపారు.బుధవారం ఆయన మాట్లాడుతూ, 10వ తరగతి అర్హతతో మూడు సంవత్సరాల వ్యవధి గల ప్లాస్టిక్స్ సాంకేతిక విద్యలో డిప్లొమా, ప్లాస్టిక్స్ మౌల్డ్ సాంకేతిక విద్యలో డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే, బీఎస్సీ అర్హతతో రెండు సంవత్సరాల వ్యవధి గల ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ మరియు పరీక్షలలో పీజీ డిప్లొమా కోర్సుకు కూడా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు.అభ్యర్థులు ఈ నెల 28, 2026లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.సిపేట్ ప్రవేశ పరీక్ష జూన్ 7, 2026న నిర్వహించబడుతుందని, ఆ పరీక్షలో సాధించిన ర్యాంక్ ఆధారంగా విజయవాడ కేంద్రంలో 150 సీట్లను భర్తీ చేస్తామని తెలిపారు.దరఖాస్తు రుసుము ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.250, ఇతరులకు రూ.500గా నిర్ణయించారని తెలిపారు. ఈ కోర్సులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఫీజు తిరిగి చెల్లింపు (ఫీజు రీయింబర్స్మెంట్) సదుపాయం అందుబాటులో ఉందన్నారు.ఈ కోర్సులు పూర్తిచేసిన వారికి ప్లాస్టిక్స్ రంగంలోని బహుళజాతి సంస్థలు మరియు అనుబంధ సంస్థల్లో జూనియర్ ఇంజనీర్ (ఉత్పత్తి), మౌల్డ్ రూపకర్త, జూనియర్ ఇంజనీర్ (నిర్వహణ), నాణ్యత నియంత్రణ విభాగంలో ఇన్స్పెక్టర్ వంటి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ప్రారంభ వేతనం నెలకు రూ.18,000 నుండి రూ.25,000 వరకు ఉండే అవకాశముందని చెప్పారు.ఆసక్తి గల విద్యార్థులు వెంటనే దరఖాస్తు చేసుకొని ప్రవేశ పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 9398535697 నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

# రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

**సర్వేకు ముందు రైతులకు ముందస్తు నోటీసులు అందజేయాలి**

**నిర్దేశించిన సమయంలోపు రీ సర్వే ప్రక్రియ పూర్తి చేయాలి: ఇంచార్జి జిల్లా కలెక్టర్ నూరుల్ ఖమర్**



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి మే 06:-**జిల్లాలో 5వ దశలో నిర్వహిస్తున్న రీ సర్వే ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని, సర్వే నిర్వహణకు ముందు రైతులకు ముందస్తు నోటీసులు అందజేయాలని ఇంచార్జి కలెక్టర్ నూరుల్ ఖమర్ అన్నారు.బుధవారం కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామంలో 5వ దశలో నిర్వహిస్తున్న రీ సర్వే ప్రక్రియను ఇంచార్జి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీ-సర్వే కార్యక్రమాన్ని ఇంచార్జి కలెక్టర్ పరిశీలించారు. కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామంలో జరుగుతున్న రీ-సర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో సందర్శించి భూమి సరిహద్దుల నిర్ధారణ, భూ సంబంధిత రికార్డుల పరిశీలన, రోవర్ యంత్రం పని తీరు తదితర అంశాలను ఇంచార్జి కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రీ-సర్వే బృందాలు నిర్వహిస్తున్న కొలతల విధానం, సాంకేతిక పరికరాల వినియోగం, భూ వివరాల నమోదు ప్రక్రియపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా రైతుల భూముల హద్దులు ఖచ్చితంగా నమోదు కావాలని, ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రైతులతో నేరుగా మాట్లాడిన ఇంచార్జి కలెక్టర్ రీ-సర్వే ప్రక్రియకు సంబంధించిన నోటీసులు మీకు అందాయా?, భూ సర్వే తేదీలు మరియు వివరాలు ముందుగానే తెలియజేస్తున్నారా?, అధికారులు మీ సందేహాలకు సమాధానాలు ఇస్తున్నారా? వంటి అంశాలపై ఆరా తీశారు. రైతులకు పూర్తి సమాచారం అందేలా చూడాలని, ప్రతి దశలో పారదర్శకత పాటించాలని అధికారులను ఆదేశించారు. రీ-సర్వే ప్రక్రియ వల్ల భూ వివాదాలు తగ్గి రైతులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఇంచార్జి కలెక్టర్ తెలిపారు. భూముల సరిహద్దులు శాస్త్రీయ పద్ధతిలో నమోదు కావడం ద్వారా భవిష్యత్తులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. ప్రభుత్వం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భూ రికార్డులను నవీకరిస్తోందని తెలిపారు. కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామ పరిధిలో మొత్తం 7,157 ఎకరాల భూమి ఉండగా, సుమారు 2,300 మంది రైతులు ఉన్నారని అధికారులు ఇంచార్జి కలెక్టర్‌కు వివరించారు. గ్రామంలో రీ-సర్వే ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని ఇంచార్జి కలెక్టర్ సూచించారు.రీ-సర్వే ప్రక్రియకు సంబంధించిన రైతుల ఈ-కేవైసీ నమోదు కార్యక్రమాన్ని ఎలాంటి లోపాలు లేకుండా పకడ్బందీగా నిర్వహించి, ప్రతి అర్హత రైతు వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని ఇంచార్జి కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ నాగరాజు, సర్వే సిబ్బంది, గ్రామస్థులు, రైతులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# యువత నైపుణ్యాలు పెంచుకుంటే అవకాశాలు అందివస్తాయి

**సెట్కూరు సీఈఓ డాక్టర్ వేణుగోపాల్.**




**కర్నూలు బ్యూరో మన జనప్రగతి మే 06:-** జిల్లా యువజన సంక్షేమ శాఖ సెట్కూరు వారి ఆధ్వర్యంలో సర్వోదయ ఐటిఐ కళాశాలలో వ్యక్తిత్వ వికాసం - ఉపాధి అవకాశాలు అనే అంశం పై బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమం లో సెట్కూర్ సీఈఓ డాక్టర్ వేణుగోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచం వేగంగా మారుతోందని,ఈ మారుతున్న కాలంలో కేవలం డిగ్రీలు కలిగి ఉండటం మాత్రమే సరిపోదని, నిజమైన విజయం సాధించాలంటే నైపుణ్యాలు ఉండాలన్నారు. నైపుణ్యాలు అంటే కేవలం ఉద్యోగానికి సంబంధించిన సామర్థ్యం మాత్రమే కాదని అవి మన ఆలోచనలను, మన ప్రవర్తనను, మన పనితీరును, మన భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి అన్నారు.యువతకు అపారమైన శక్తి ఉంది. ఆ శక్తిని సరైన దిశలో వినియోగించగలిగితే, ఏ అడ్డంకీ పెద్దది కాదు. ఒక యువకుడు లేదా యువతి నిరంతరం నేర్చుకునే మనస్తత్వాన్ని పెంచుకుంటే, వారు జీవితంలో ఏ రంగంలోనైనా విజయం సాధించగలరని తెలిపారు. కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ నైపుణ్యాలు, సమస్య పరిష్కార సామర్థ్యం, నాయకత్వ లక్షణాలు, సమయపాలన, బృందంగా పనిచేయగలగడం వంటి నైపుణ్యాలు ఈరోజు అత్యంత అవసరం అని వివరించారు. ఈ రోజుల్లో కంపెనీలు, సంస్థలు, ప్రభుత్వ రంగాలు కూడా "ఏం చదివారు?" అన్నదానితో పాటు "ఏం చేయగలరు?" అన్నదానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాయన్నారు.నైపుణ్యాలే మన ఆయుధం, ఆత్మవిశ్వాసమే మన బలం, కృషే మన విజయానికి మార్గం అని వివరించారు.సైకాలజిస్ట్ శ్రీమతి జ్యోతిర్మయి మాట్లాడుతూ యువత ముందుగా తమలోని బలహీనతలను గుర్తించి, వాటిని బలాలుగా మార్చుకోవాలన్నారు. మొబైల్ ఫోన్‌ను వినోదం కోసం మాత్రమే కాకుండా, నేర్చుకోవడానికి, కొత్త స్కిల్స్ సంపాదించడానికి, ఆన్‌లైన్ కోర్సులు చేయడానికి ఉపయోగించాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ జీవరత్నం, సెట్కూరు సిబ్బంది నిదీశ్,మౌలాలి మరియు అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామాల్లోనే రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ఒక నెల – ఒక గ్రామం.

**నాలుగు పర్యటనలు కార్యక్రమం ప్రారంభం.**

**జిల్లాలో రేపటి గురువారం నుంచే ఈ కార్యక్రమం అమలుకు శ్రీకారం: జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.**

**కర్నూలు బ్యూరో మన జనప్రగతి మే 06:-** గ్రామాలను 'రెవెన్యూ ఫిర్యాదుల రహిత గ్రామాలు'గా మార్చడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఒక నెల - ఒక గ్రామం - నాలుగు పర్యటనలు కార్యక్రమం అమలు చేస్తోందని, జిల్లాలో ఈ కార్యక్రమం రేపటి గురువారం నుంచే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు.క్షేత్రస్థాయిలో భూసమస్యలను సత్వరంగా, నాణ్యమైన పరిష్కారం చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెల గురువారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సర్వే పూర్తయిన గ్రామాలు లేదా భూ సమస్యలు ఎక్కువగా ఉన్న గ్రామాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.తహసిల్దార్, ఎంపీడీవో, ఏఈ పిఆర్, ఏఈ హౌసింగ్, ఏ ఈ జల వనరుల శాఖ, ఏఈ ఆర్డబ్ల్యూఎస్, ఎండోమెంట్స్, అటవీ శాఖ తదితర మండల స్థాయి అధికారులంతా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందులో భాగంగా మొదటి గురువారం ప్రజల నుండి వినతులను స్వీకరించడంతో పాటు ప్రభుత్వ భూములను పరిశీలించడం, విచారణలు చేపట్టడం, నోటీసులు అందచేయడం వంటి ప్రక్రియలను నిర్వహించాలని తెలిపారు. రెండవ గురువారం మొదటిసారి స్వీకరించిన అర్జీలను పరిష్కరించడం, కొత్తగా వినతులు తీసుకోవడం చేయాలన్నారు. గురువారం గత రెండు గురువారాల్లో స్వీకరించిన వినతుల పరిష్కారం గురించి, విచారణలు, ఉత్తర్వుల గురించి ప్రజలకు తెలియపరచడం చేయాలన్నారు. నాలుగవ గురువారం గత మూడు గురువారాల్లో ఏమేమి సమస్యలను పరిష్కరించారన్న వివరాలను గ్రామ సభ నిర్వహించి ప్రజలకు వివరించాలని కలెక్టర్ ఆదేశించారు.భూ సమస్యల సత్వర పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఒక నెల- ఒక గ్రామం- నాలుగు పర్యటనలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



# "ఉచిత కంటి" ఆపరేషన్లకు విశేష స్పందన..!




**పత్తికొండ మన జన ప్రగతి మే 06:-** పత్తికొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూర్వ విద్యార్థులు మరియు యువ స్పందన సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరంలో విజయవంతంగా కంటి ఆపరేషన్లు జరిగాయని, ఈ కంటి ఆపరేషన్లకు విశేష స్పందన వచ్చిందని ఆసుపత్రి కోఆర్డినేటర్ అరులు తెలిపారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఉచిత కంటి వైద్య శిబిరం యందు వైద్య పరీక్షల అనంతరం ఆపరేషన్లు చేయించుకున్న వారికి సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... బెంగళూరు చిట్టెం హనుమాన్ ప్రసాద్, చెన్నై శంకర నేత్రాలయ ఆసుపత్రి సహకారంతో అత్యాధునిక పరికరాలతో వారం రోజుల నుండి కంటి వైద్య పరీక్షలు మరియు మూడు రోజుల నుండి కంటి ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రిటైర్డ్ ప్రొఫెసర్ తుమ్మంద్రా వెంకటేశ్వర్లు కుటుంబం మరియు ఐఆర్ఎస్ అసిస్టెంట్ కమిషనర్ సురేష్ కుమార్ వారి కుటుంబం ఆధ్వర్యంలో కంటి ఆసుపత్రికి వచ్చిన ప్రజలకు అన్నదానం, యువ స్పందన సొసైటీ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఉచిత కంటి వైద్య శిబిరంలో ఉదయం 21 మందికి ఆపరేషన్ లు మరియు దాదాపు 95 మందికి వైద్య పరీక్షలు చేశామని శంకర నేత్రాలయ ఆసుపత్రి కోఆర్డినేటర్స్ అరులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్నూలు వాటర్ రిసోర్స్ డిపార్ట్మెంట్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణా నాయక్, పూర్వ విద్యార్థులు వీరేశప్ప, సాయిబాబా, భాస్కర్ యువ స్పందన సొసైటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు సురేంద్ర, లక్ష్మన్న, సెక్రటరీ నాగరాజు, సభ్యులు మధు, రమేష్, గిరి, రాజేశ్వరి, వాలంటీర్లు, ఆసుపత్రి సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# వివేకానంద నగర్ కాలనీలో సిసి రోడ్డుకు భూమి పూజ



**కడప మన జనప్రగతి మే 06:-** కడపనగరంలోని వివేకానంద నగర్ కాలనీ లో నీ ఏ క్రాస్ నందు సిసి రోడ్డుకు ప్రభుత్వ సివిల్ సప్లై రాష్ట్ర డైరెక్టర్ చిట్టి బోయిన సుబ్బరాయుడు యాదవ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ కడప శాసనసభ్యురాలు మాధవి రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న ఈ రోడ్డుకు కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే జనరల్ ఫండ్ నుండి ఆరు లక్షల 70 వేల రూపాయలు కేటాయించి రోడ్డు నిర్మిస్తున్నామని వీటి వలన ప్రజలకు రోడ్డు వలన ఇబ్బందులు తొలుగుతాయని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో రామ్ లక్ష్మణ్ రెడ్డి మన్సూర్ అలీ ఖాన్ బోనం శిలాస్ లోమడ మనోజ్ కుమార్ రెడ్డి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే మా లక్ష్యం

**• సిద్ధవటం పంచాయతీ కార్యదర్శి సునీల్**



**సిద్ధవటం మన జనప్రగతి మే 06:-** ప్రజల సమస్యలను పరిష్కరించడం కోసం నిరంతరం కృషి చేస్తామని సిద్ధవటం మండలం ఉప్పరపల్లి పంచాయతీ కార్యదర్శి సునీల్ పేర్కొన్నారు. బుధవారం ఉప్పరపల్లి గ్రామ సచివాలయంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ప్రధానంగా తాగునీరు, వీధి దీపాలు, పారిశుద్ధ్యం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. గ్రామంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం


**- టిడిపి రాష్ట్ర కార్యదర్శి మోహన్ రెడ్డి**



**సిద్ధవటం మన జనప్రగతి మే 06:-** మండలంలోని జ్యోతి గ్రామంలో ఉపాధి హామీ నిధులతో నిర్మించిన 'గోకులం' షెడ్డును టిడిపి రాష్ట్ర కార్యదర్శి శనివారపు మోహన్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనను మాట్లాడుతూ, రైతు సంతోషమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గ్రామగ్రామాన మినీ గోకులాలు నిర్మిస్తున్నారని తెలిపారు. ఈ షెడ్లు పశువుల సంరక్షణకు రైతులకు ఎంతో ఊరటనిస్తాయని పేర్కొన్నారు.గత ఐదేళ్లలో గ్రామాల్లో అభివృద్ధి శూన్యమని విమర్శించిన ఆయన, ప్రస్తుత ప్రభుత్వం సిసి రోడ్ల నిర్మాణం వంటి పనులతో గ్రామాలను అభివృద్ధి చేస్తోందని చెప్పారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కూటమి విజయం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

# గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి: హౌసింగ్ ఏఈ చెన్నయ్య

**సిద్ధవటం మన జనప్రగతి మే 06:-**మండలంలోని ఉప్పరపల్లి, మాధవరం గ్రామాల్లో గత ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా గృహాల నిర్మాణ పనులను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ చెన్నయ్య సూచించారు. బుధవారం ఎస్కే నగర్‌లో లబ్ధిదారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. చాలా చోట్ల పనులు నత్తనడకన సాగుతున్నాయని, లబ్ధిదారులు చొరవ తీసుకుని పనులు వేగవంతం చేసేలా అవగాహన కల్పించామని తెలిపారు



# మహిళలకు ఆల్హాదకరమైన స్విమ్మింగ్ పూల్



**కడప మన జనప్రగతి మే 06:-**కడపనగరంలోని రెండవ డివిజన్ వైఎస్ఆర్ కాలనీ రోడ్డు నందు నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ ఊరకొండ మల్లికార్జున స్విమ్మింగ్ పూల్ ను నిర్వాకులు శ్రీనివాస యాదవ్ వెంకటరమణ యాదవ్ సుబ్బరాయుడు యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం కడప ఎమ్మెల్యే మాధవరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో మండిపోతున్న ఎండలకు తాళలేక పోతున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా అభివృద్ధి చెందుతున్న నగరాలతో పోటీపడుతూ కడప నగరం కూడా అన్ని మహిళల కోసం స్విమ్మింగ్ పూల్ను అన్నిహంగులతో ఏర్పాటు చేశారు. మహిళలకు పిల్లలకు భద్రతను ప్రాధాన్యతను మొదటి ప్రాముఖ్యంగా తీసుకొని స్విమ్మింగ్ పూల్ నడుపుతున్నారు ప్రజలందరూ వీటి వినియోగించుకోవాలని వారు కోరారు. కడప నగరంలో మహిళల కోసమే ప్రత్యేకమైన స్విమ్మింగ్ పూల్ ను ఏర్పాటు చేయడం సంతోషదగ్గ విషయం అన్నారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు ఇస్తున్న గౌరవం ఇలాంటి ఎన్నో ఉన్నాయన్నారు ఈ కార్యక్రమంలో రెండవ డివిజన్ ఇంచార్జ్ సుబ్బారెడ్డి బాలకొండయ్య రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టరు సుబ్బరాయుడు యాదవ్ మన్సూర్ అలీ ఖాన్. రెడ్డయ్య యాదవ్ లోమడ మనోజు మాజీ కార్పొరేటర్లు తెలుగుదేశం పార్టీ నాయకులు డివిజన్ కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# శుభ్ర గ్రామాల దిశగా పవన్ కళ్యాణ్ చర్యలు

**• మ్యాజిక్ డ్రైన్స్‌తో గ్రామీణ సమస్యలకు పరిష్కారం:**

**జనసేన నేత డాక్టర్ దాసరి రవిశంకర్**



**వేంపల్లె మన జనప్రగతి మే 06:-**గ్రామీణ ఆంధ్రప్రదేశ్‌ను పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేపడుతున్న కార్యక్రమాలు ఫలితాలిస్తున్నాయని జనసేన నాయకుడు దాసరి రవిశంకర్ పేర్కొన్నారు. గ్రామాల్లో దీర్ఘకాలంగా కొనసాగుతున్న పారిశుధ్య సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వినూత్న విధానాలను అమలు చేస్తోందని తెలిపారు.పల్లెల్లో మురుగు నీటి పారుదల వ్యవస్థల లేమి కారణంగా ప్రజలు అనారోగ్యకర పరిస్థితుల్లో జీవిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యకు పరిష్కారంగా 'మ్యాజిక్ డ్రైన్స్' తరహాలో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. వీటి ద్వారా మురుగు నీరు తక్షణమే శుద్ధి చెయ్యబడి భూగర్భ జలాలుగా మారుతుందని వివరించారు.మూడంచెల ఫిల్టర్ బెడ్స్ ద్వారా నీటిని శుద్ధి చేసి తిరిగి వినియోగంలోకి తీసుకురావడం వల్ల గ్రామాల్లో పరిశుభ్రత పెరగడంతో పాటు ఆరోగ్య సమస్యలు తగ్గుముఖం పడతాయని రవిశంకర్ తెలిపారు.ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఇలాంటి మరిన్ని కార్యక్రమాలను అమలు చేస్తూ రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

# చంద్రబాబు నిర్మించేది చంద్రావతి

**12వ పిఆర్సి నిధులు విడుదల చేయాలి: కాంగ్రెస్ నాయకుడు చింతా మోహన్**



**కాకినాడ మన జనప్రగతి మే 06:-**సీఎం చంద్రబాబు రాజధాని అమరావతి అని చెప్పి చంద్రావతి నిర్మిస్తున్నారని దీనికి లక్షల కోట్ల రూపాయలు అనవసరంగా ఖర్చు చేస్తున్నారంటూ మాజీ మంత్రి కాంగ్రెస్ సీనియర్ నేత చింతామోహన్ విమర్శించారు. సోమవారం కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద తమ పార్టీ నాయకులతో కలిసి చంద్రబాబు నిర్మిస్తున్న రాజధాని శాశ్వత రాజధాని కాదని తాత్కాలిక రాజధాని మాత్రమేనని తీవ్రస్థాయిలో విమర్శించారు. రాష్ట్రంలో ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉండగా కేవలం రాజధానిలో నిర్మించే నిర్మాణాలకు ఇతర దేశాల నుండి అద్దాలను తెప్పించి 2వేల కోట్ల రూపాయలు ఖర్చుచేసిన ఘనత ఒక చంద్రబాబుకే చెందుతుందని చెప్పారు. అప్పులు చేసి రాజధాని నిర్మిస్తే తర్వాత పరిణామాలు ప్రజలపై ప్రజావ్యవస్థ అస్తవ్యస్తమవుతుందని దీనికి తర్వాత ఎవరు సమాధానం చెబుతారని అన్నారు. రాష్ట్రంలో అవినీతిలో కూరుకుపోయిన చంద్రబాబు, జగన్'లు త్వరలో భూస్థాపితం అవుతాయని ఆయన చెప్పారు. ఏదేమైనా ఇది ఆంధ్ర ప్రజల కలల రాజధాని కాదని కేవలం చంద్రబాబు నిర్మించుకుంటున్న చంద్రావతి అని విమర్శించారు. అలాగే ఉద్యోగులకు 12వ పిఆర్సి అమలు చేసి వారికి దీర్ఘకాలంగా 30 వేల కోట్ల రూపాయలు, నాలుగు డీఏలు తక్షణ విడుదల చేయాలని మోహన్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు, కాకినాడ సిటీ అధ్యక్షుడు చెక్క నూకరాజు, నారయ్య కాపు, పెద్దాపురం ఇంచార్జ్ మలకల సూరిబాబు పాల్గొన్నారు.

# వివాహ వేడుకల్లో వైకాపా నాయకులు

**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మే 06:** పులివెందులలోని విజయ గార్డెన్లో బుధవారం జరిగినటువంటి పో రెడ్డి కుటుంబ సభ్యుల వివాహానికి వైకాపా నాయకులు హాజరై వధూవరులకు ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమాలలో వైకాపా విద్యార్థి విభాగం నాయకుడు పోరెడ్డి జస్వంత్ రెడ్డి తమ్ముడు ఆయనటువంటి యశ్వంత్ రెడ్డి చందన ల వివాహ వేడుకలు అత్యంత వైభవంగా జరగగా వైకాపా నాయకులు ప్రతాప్ రెడ్డి,మాజీ మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి,మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్,వైకాపా పులివెందుల పట్టణ కన్వీనర్ గంగాధర్ రెడ్డి,మాజీ కౌన్సిలర్ కోడి రమణ,వైకాపా పట్టణ ఉపాధ్యక్షుడు పార్లపల్లె కిషోర్, శ్రీనివాసులు రెడ్డి మరియు ఇతర వైకాపా శ్రేణులు హాజరై వధూవరులను నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆశీర్వదించారు. వివాహ బంధుమిత్రులు వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# సింహాద్రిపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ ఉచిత కోచింగ్ విద్యార్థుల ప్రతిభ

**• పాలిసెట్-2026 ఫలితాల్లో 75 శాతం ఉత్తీర్ణత**

**• ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డా.ఎ.శివ శంకర్**



**సింహాద్రిపురం మన జనప్రగతి మే 06:** రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన పాలిసెట్2026 ఫలితాల్లో సింహాద్రిపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబరిచారు.మంగళవారం (మే 5) విడుదలైన ఈ ఫలితాల్లో కళాశాల ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ పొందిన విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించి సత్తా చాటారని ఉచిత శిక్షణలో పాల్గొన్న 131 మంది విద్యార్థులలో 75% శాతం మంది అర్హత సాధించారని ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డా.ఎ.శివ శంకర్ తెలిపారు.ప్రత్యేకంగా టాప్ ర్యాంకర్లగా కోచింగ్ తీసుకున్న విద్యార్థినిలు అభినయ శ్రీ 4721 ర్యాంకు (హాల్ టికెట్: 5471010)వెంకట పవిత్ర 5128 ర్యాంకు (హాల్ టికెట్: 5471009)నాగ హస్మిత 5321 ర్యాంకు (హాల్ టికెట్: 5471079) సాధించారు.ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డా.ఎ.శివ శంకర్ ప్రత్యేకంగా అభినందించారు.గ్రామీణ ప్రాంత విద్యార్థులు క్రమశిక్షణతో చదివి మంచి ర్యాంకులు సాధించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.ఎస్‌బిటిఇటి,ఆంధ్రప్రదేశ్ (మంగళగిరి) ఆధ్వర్యంలో నిర్వహించే వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియ ఈ నెలలోనే ప్రారంభమయ్యే అవకాశం ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు.విద్యార్థులు తమ ఒరిజినల్ ధృవపత్రాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు.ప్రవేశాలు మరియు కౌన్సెలింగ్‌కు సంబంధించిన సందేహాల కోసం 9010222184 నంబర్‌ను సంప్రదించవచ్చు అని తెలియజేశారు.

# ఉప్పరపల్లిలో 'లో-వోల్టేజ్'తో ఇబ్బందులు పడుతున్న ప్రజలు


**• యాభై కుటుంబాలకు శాపంగా మారిన కరెంటు..!**



**సిద్దవటం మన జనప్రగతి మే 06:-** మండల పరిధిలోని ఉప్పరపల్లి గ్రామ పంచాయతీ మాధవరం పి.హెచ్.సి సెంటర్ నుండి నేషనల్ హైవే, రైల్వే లైన్ మధ్య ఉన్న సుమారు 50 కుటుంబాలు తీవ్రమైన లో-వోల్టేజ్ విద్యుత్ సమస్యతో నరకయాతన అనుభవిస్తున్నాయి. సంవత్సరాలుగా ఈ సమస్య వేధిస్తున్నా అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదని బుధవారం స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. లో-వోల్టేజ్ కారణంగా కనీసం ఫ్యాన్లు తిరగడం లేదని, మిక్సీలు, మోటార్లు పనిచేయక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మహిళలు, చిరు వ్యాపారులు వాపోయారు. ఎండల తీవ్రతకు పిల్లలు, వృద్ధులు ఉక్కపోతతో అల్లాడుతున్నారని, దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. దీనిపై ఒంటిమిట్ట విద్యుత్ శాఖ ఏఈ జయకేశవరెడ్డి స్పందిస్తూ.. సమస్య తన దృష్టికి రాలేదని, త్వరలోనే ఆ ప్రాంతాన్ని పర్యటించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# ఎస్ఎస్ మాల్ వ్యవహారం వేడెక్కింది..!

**• "ప్రమాణం చేద్దాం" అంటూ రాచమల్లుకు ప్రవీణ్ రెడ్డి సవాల్**




**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జన ప్రగతి మే 06:-**టిడిపి మాజీ ఇంచార్జ్ డాక్టర్ జి.వి. ప్రవీణ్ కుమార్ రెడ్డి బుధవారం స్థానిక వైఎంఆర్ కాలనీలోని తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డికి బహిరంగ సవాల్ విసిరారు. తనపై చేసిన ఆరోపణలపై ప్రమాణం చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, అందుకు తేదీ, సమయం, స్థలం రాచమల్లు ప్రకటించాలని కోరారు. రాచమల్లు శివప్రసాద్ రెడ్డి, ఆయన సోదరుడు రాచమల్లు కిరణ్ కుమార్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి కలిసి వస్తే, తాను తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రమాణం చేయడానికి సిద్ధమని తెలిపారు.ఎస్ఎస్ మాల్ అంశంపై తాను చేసిన ఆరోపణలను ఖండించిన రాచమల్లు, 2017లో అక్రమ నిర్మాణాలపై అధికారులకు లేఖలు రాసినా, 2019 నుంచి 2024 వరకు అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఉండి ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. తాను ఆదివారం ఎస్ఎస్ మాల్ అంశాన్ని ప్రస్తావించిన తర్వాత దాదాపు రూ.20 లక్షలు మున్సిపాలిటీకి చెల్లించినట్లు మున్సిపల్ ఆర్ఐ తెలిపారని అన్నారు. మైదుకూరు రోడ్డును ప్రస్తావిస్తూ, రాచమల్లు ఎమ్మెల్యే కాకముందు ఆ రహదారి ఎలా ఉండేదో ప్రజలకు తెలుసన్నారు. కూరగాయల మార్కెట్‌లో అక్రమ వసూళ్లు జరిగాయని ఆరోపించారు. భయం, తనకా.. రాచమల్లుకా అనేది గతాన్ని చూసుకుంటే తెలుస్తుంది అని వ్యాఖ్యానించిన ప్రవీణ్ కుమార్ రెడ్డి, 2019 నుంచి 2023 వరకు టిడిపికి దూరంగా ఉన్న వారు ఇప్పుడు తనను విమర్శించడం సరికాదన్నారు.తాను ఎప్పుడూ పార్టీ జెండాను అమ్ముకోలేదని, కౌన్సిలర్ టికెట్లను అమ్ముకున్న వారు ప్రస్తుత ఎమ్మెల్యే వర్గంలో ఉన్నారని విమర్శించారు. పార్టీ కష్టకాలంలో ఎవరు నిలబడ్డారో నిజమైన టిడిపి కార్యకర్తలతో ఓటింగ్ నిర్వహించేందుకు సిద్ధమా అని సవాల్ చేశారు. ప్రొద్దుటూరులో గత 40 ఏళ్లుగా ఇద్దరు నాయకుల రాజకీయాల వల్ల అభివృద్ధి కుంటుపడిందని ఆరోపిస్తూ, పట్టణ అభివృద్ధి కోసం తాను నిరంతరం పోరాడతానని స్పష్టం చేశారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
07 -05-2026

# ఉచిత కంటి పొర చికిత్స శిబిరాన్ని విశేష స్పందన

● ఇచ్చిన మందులను సక్రమంగా


**వాడాలి: శంకర్ నేత్రాలయ ఇన్చార్జ్ భాను ప్రకాష్**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మే 06:** పులివెందుల పట్టణంలోని స్థానిక బాకరాపురంలోని వెంకటప్ప మెమోరియల్ పాఠశాలలో కంభం తిరుమలరెడ్డి ధర్మపత్ని రామ లక్ష్మమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత కంటిపుర చికిత్స కార్యక్రమానికి వారం రోజులపాటు విశేష స్పందన లభించిందని శంకర్ నేత్రాలయ ఇంచార్జ్ భాను ప్రకాష్ అన్నారు.బుధవారం కంటి పరీక్షలు చేయించుకున్న వారితో ఆయన సమావేశాన్ని నిర్వహించి సూచనలు సలహాలు అందజేశారు.ఆయన మాట్లాడుతూ శంకర్ నేత్రాలయ పుట్టపర్తి,కంభం తిరుమలరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఐదో తేదీ వరకు ఉచిత కంటి పొర చికిత్స శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ప్రతి ఏటాకంభం తిరుమలరెడ్డి ధర్మపత్ని రామ లక్ష్మమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు తిరుమల్ రెడ్డి ఉచిత కంటి చికిత్స శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నారన్నారు.కంటి పరీక్షలు నిర్వహించుకున్న వారికి మాత్రలు,అద్దాలు, ఉచితంగా అందజేయడం జరిగిందన్నారు.ఆపరేషన్ చేయించుకున్న వారు అద్దాలు నెలరోజుల పాటు గాలి తగలకుండా వాడాలన్నారు. ఇచ్చిన చుక్కల మందులను క్రమం తప్పకుండా కంటిలో వేసుకోవాలన్నారు.ఇక్కడికి వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మంచినీటి సౌకర్యాన్ని,భోజన సౌకర్యాన్ని కూడా కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు.

# అయ్యప్ప స్వామికి పంచామృతాభిషేకాలు

**● ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చిన మణికంఠుడు**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మే 06:** పులివెందుల పార్నపల్లి రోడ్డు కోటి సమాధి సమీపంలో కొలువై ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో హరిహర పుత్రుడు అయ్యప్ప స్వామికి విశేష పూజలు నిర్వహించారు. బుధవారం ఉదయాస్తమాన ఆలయ ప్రధాన అర్చకులు సాయి,మధు,గురుస్వామి వెంకట రామిరెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృత అభిషేకం,సహస్రనామార్చన, బిల్వ అర్చన,అష్టోత్ర శతనామావళి,తదితర పూజ కైకర్యాల అనంతరం అయ్యప్ప స్వామి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శన మిచ్చారు.ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు గురుస్వామి వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులతో కార్తీక మాసం, 365 రోజులలో ప్రతి నిత్యము బుధవార రోజులలో స్వామివారికి విశేష పూజలు ధూప దీప నైవేద్యాలు భక్తుల సహాయ సహకారాలతో భక్తిశ్రద్ధలతో నిర్వహించడంగ జరుగుతోందన్నారు.ప్రతి మాసంలో అయ్యప్ప స్వామి జన్మ నక్షత్రంలో విశేష పూజలు కూడా నిర్వహించడం జరుగుతు ఒదన్నారు. సాయంకాల సమయాన భజన కార్యక్రమాలు భక్తుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటుచేసిన తీర్థ ప్రసాదాలను అయ్యప్ప స్వాములకు భక్తులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# గెలిచిన రాముడు - ఆకివీడులో రామాలయ పునర్నిర్మాణానికి అడ్డంకులు చెదిరిన వేళ

**● హిందుత్వానికి విజయం సాధించిందని జనసేన నాయకుల వ్యాఖ్యలు**

**● హైకోర్టు పిటిషన్ కొట్టివేతతో నిర్మాణానికి మార్గం సుగమం**

**● రఘురామకృష్ణంరాజు దృఢ సంకల్పానికి అభినందనలు**

**● భక్తుల విరాళాలతో వేగంగా సాగుతున్న పనులు**



**వేంపల్లి మన జనప్రగతి మే 06:**-ఆకివీడులో రామాలయ పునర్నిర్మాణం విజయవంతంగా ముందుకు సాగుతుండటం పట్ల జనసేన నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు గోసల ఆంజనేయులు మాట్లాడుతూ..రాముడు ధర్మానికి ప్రతీక, సత్యానికి నిలువుదోరగా నిలిచిన మహనీయుడు అని పేర్కొన్నారు. అలాంటి రాముడి ఆలయ నిర్మాణాన్ని ఎవ్వరూ ఆపలేరని మరోసారి రుజువైందన్నారు.రామాలయ నిర్మాణాన్ని అడ్డుకునే ప్రయత్నాలు జరిగినప్పటికీ, అవన్నీ విఫలమయ్యాయని ఆయన తెలిపారు. ముఖ్యంగా దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేయడం ద్వారా నిర్మాణానికి పూర్తి అనుమతులు లభించాయని చెప్పారు. దీంతో ఆలయ పునర్నిర్మాణానికి మార్గం సుగమమైందన్నారు.ఈ క్రమంలో రఘురామకృష్ణంరాజు దృఢ సంకల్పం ప్రత్యేకంగా ప్రశంసనీయం అని జనసేన నాయకులు పేర్కొన్నారు. ఆయన పట్టుదలతో ముందుకు సాగడంతో భక్తుల మద్దతు విపరీతంగా లభించిందని, కోట్ల రూపాయల విరాళాలు వెల్లువెత్తాయని వివరించారు.ప్రస్తుతం అన్ని అనుమతులతో ఆలయ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని,రామభక్తుల ఆశయానికి ఇది నిదర్శనమని వారు తెలిపారు.రఘురామకృష్ణంరాజు తన సంకల్పాన్ని నెరవేర్చే వరకు వెనుకడుగు వేయరని, ఆయనకు జనసేన నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## 12 గంటల్లో మిస్సింగ్ బ్యాగ్ ట్రేస్.. బాధితులకు

# అందజేసిన పులివెందుల పోలీసులు

**● సీఐ శ్రీరామ్ నేతృత్వంలో వేగవంతమైన దర్యాప్తు ● సీసీ కెమెరాల సహాయంతో బ్యాగ్ గుర్తింపు ● 6.5 తులాల బంగారం సురక్షితంగా రికవరీ ● పోలీసులపై బాధితుల కృతజ్ఞతలు,ప్రశంసలు**



**పులివెందుల అర్బన్, మన జనప్రగతి మే 06:-** తమ విధి నిర్వహణలో పులివెందుల పోలీసులు మరోసారి సమర్థతను చాటుకున్నారు. బస్సులో పొరపాటున తారుమారైన ఆరున్నర తులాల బంగారు ఆభరణాల బ్యాగ్‌ను కేవలం 12 గంటల వ్యవధిలోనే ట్రేస్ చేసి బాధితులకు అందజేసి ప్రశంసలు అందుకుంటున్నారు.ప్రొద్దుటూరు మండలం పోట్లదుర్తి గ్రామానికి చెందిన సంజీవ రాయుడు కుటుంబం బస్సులో హిందూపురం వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. వారి వద్ద ఉన్న బ్యాగ్‌లా మరో బ్యాగ్ ఉండటంతో పొరపాటున వేరే బ్యాగ్‌ను తీసుకుని గోరంట్లలో దిగిపోయారు. అనంతరం బ్యాగ్ తెరిచి చూడగా అందులో తమ బంగారం లేకపోవడంతో వారు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.బాధితులు తొలుత కదిరి పోలీసులను ఆశ్రయించగా, వారు పులివెందుల పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఫిర్యాదు అందుకున్న వెంటనే పులివెందుల అర్బన్ సీఐ శ్రీరామ్ స్పందించి, ఒక హెడ్ కానిస్టేబుల్ మరియు ఇద్దరు కానిస్టేబుళ్లతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు.బస్టాండ్ మరియు పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరా ఫుటేజీని నిశితంగా పరిశీలించిన పోలీసులు పక్కా సమాచారంతో గాలింపు చేపట్టి కేవలం 12 గంటల్లోనే ఆభరణాల బ్యాగ్‌ను ట్రేస్ చేశారు.6.5 తులాల బంగారం సురక్షితంగా తిరిగి లభించడంతో బాధితులు భావోద్వేగానికి లోనయ్యారు.తమ సొమ్మును తక్కువ సమయంలోనే వెతికి ఇచ్చిన సీఐ శ్రీరామ్ మరియు సిబ్బందికి వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సమర్థవంతంగా పనిచేసిన పోలీసు సిబ్బందిని సీఐ అభినందించారు.

# ప్రావిడెంట్ ఫండ్ ఆన్లైన్ ప్రక్రియను వేగవంతం చేయండి

**● జడ్పీ సీఈఓకు యుటిఎఫ్ కడప జిల్లా శాఖ వినతి**



**కడప మన జనప్రగతి మే 06:**-మండల, జిల్లా పరిషత్ పరిధిలోని ఉపాధ్యాయుల ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలకు సంబంధించిన ఆన్లైన్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి చీదెళ్ళ సుబ్రమణ్యం కు యుటిఎఫ్ కడప జిల్లా శాఖ విజ్ఞప్తి చేసింది. బుధవారం ఉదయం కడపలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ముఖ్య కార్యనిర్వహణాధికారి చీదెళ్ళ సుబ్రమణ్యం ను కలిసి ఉపాధ్యాయుల ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలకు సంబంధించిన సమస్యలపై యుటిఎఫ్ జిల్లా శాఖ పక్షాన వినతి పత్రం సమర్పించారు ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబులు మాట్లాడుతూ మండల, జిల్లా పరిషత్ పరిధిలోని ఉపాధ్యాయుల ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలు జిల్లా పరిషత్ కార్యాలయం వారు నిర్వహిస్తారని, రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఉపాధ్యాయులకు సంబంధించిన ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలను ఆన్లైన్ ద్వారా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు, దీనివల్ల ఖాతాల నిర్వహణ పారదర్శకంగా ఉండటంతో పాటు, ఉపాధ్యాయుల ఖాతాల వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. కడప జిల్లాలో ఆన్లైన్ విధానం లేకపోవడం మూలాన గతంలో యుటిఎఫ్ జిల్లా శాఖ పక్షాన ఆన్లైన్ విధానం కోసం ముఖ్య కార్యనిర్వహణాధికారికి పలుమార్లు ప్రాతినిధ్యాలు చేశామన్నారు. యుటిఎఫ్ ప్రాతినిధ్యం మేరకు స్పందించిన గత సీఈవో ప్రావిడెంట్ ఫండ్ ఆన్లైన్ ప్రక్రియను జిల్లా పరిషత్ చైర్మన్ ఆధ్వర్యంలో ప్రారంభించారన్నారు. అయితే ఆన్లైన్ ప్రక్రియ పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులకు అందుబాటులోకి రాలేదని తెలిపారు. దీంతోపాటు ప్రావిడెంట్ ఫండ్ స్లిప్పులను సైతం జిల్లా పరిషత్ వారు వెబ్సైట్ నుండి తొలగించడంతో ఉపాధ్యాయులకు సంబంధించిన ప్రావిడెంట్ ఫండ్ వివరాలను తెలుసుకోవడం ఇబ్బందికరంగా ఉందన్నారు. అలాగే ఉపాధ్యాయుల ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలను నిర్వహిస్తున్న రాజంపేట క్లర్క్ పదవీ విరమణ చెందడంతో ఆ స్థానం ఖాళీగా ఉందన్నారు. దీనివల్ల గత కొంతకాలంగా ఉపాధ్యాయుల సంబంధించిన ప్రావిడెంట్ ఫండ్ రుణాల మంజూరుతో పాటు పదవీ విరమణ చెందిన ఉపాధ్యాయుల ప్రావిడెంట్ ఫండ్ తుది చెల్లింపుల ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతున్నదని పేర్కొన్నారు. ఈ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ముఖ్య కార్యనిర్వహణాధికారి తగు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. యుటిఎఫ్ జిల్లా శాఖ విజ్ఞప్తి పై స్పందించిన జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి చీదెళ్ళ సుబ్రమణ్యం మాట్లాడుతూ వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని, ఆన్లైన్ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు ఖాళీగా ఉన్న క్లర్క్ స్థానాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, డి.సుబ్బారావు, జె.వి.సుబ్బారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు వి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# విజయ్ దళపతి ప్రభంజనం

**● తమిళనాడులో మోగిన విజయ్ విజిల్**

**● డాక్టర్ కోలా ప్రసాద్ అభినందనలు**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మే 06:** తమిళనాడు శాసనసభ ఎన్నికలలో ఘన విజయం సాధించిన విజయ్ దళపతి కి నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను అని దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ కోలా ప్రసాద్ అన్నారు.ఈ సందర్భంగా కోలా ప్రసాద్ మాట్లాడుతూ దళిత కుటుంబంలో పుట్టి ఇంత గొప్ప నాయకుడిగా ఎదగడం చాలా గర్వకారణం అన్నారు.తమిళనాడు ప్రజలకు సేవ చేయడంలోనూ,వారి నూతన పురోగతికి శ్రేయస్సుకు అర్థవంతంగా తోడ్పడటంలోనూ ఆయన చేసే కృషిలో సంపూర్ణ విజయం చేకూరాలని దేవుని ప్రార్థిస్తున్నట్లు ఆయన తెలిపారు.ప్రజలు ఆయన మీద ఎంతో విశ్వాసాన్ని పెట్టుకొని ఆయన ఏర్పాటు చేసిన పార్టీకి ఓట్లు వేయడం జరిగిందన్నారు.తమిళనాడులో విజయ్ విజిల్ మోగిందన్నారు.ప్రజలకు స్వచ్ఛమైన పాలన అందించి ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## కె.వి.పల్లి మండల టాపర్‌కు ఎమ్మెల్యే,డీఈవో ప్రత్యేక అభినందనలు



**పీలేరు మన జనప్రగతి మే 06:**-కె.వి.పల్లి ఆదర్శ పాఠశాలలో 10వ తరగతిలో 578 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థి ఎస్. గోవర్ధన్‌ను ఘనంగా సత్కరించారు. కలికిరి నగిరిపల్లిలో నిర్వహించిన "10వ తరగతి విద్యార్థుల అభినందన సభ"లో పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం కలిసి గోవర్ధన్‌కు మెమంటో, శాలువా, సర్టిఫికెట్ అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులు కృషి, పట్టుదలతో చదువుకుంటే మరింత ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు. గోవర్ధన్ సాధించిన విజయం ఇతర విద్యార్థులకు ప్రేరణగా నిలవాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రిన్సిపల్ శీను నాయక్, ఇంచార్జి ప్రిన్సిపాల్ చెన్నూరి బాలాజీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# బస్టాండ్‌లో ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ

**తల్లాడ,మన జనప్రగతి మే 06:-** మండల కేంద్రంలోని తల్లాడ బస్టాండ్ లో నిత్యం ఒక వారం నుంచి మజ్జిగ పంపిణీ కార్యక్రమం జరుగుతుంది. బుధవారం మాజీ వైరా వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ధూపాటి భద్ర రాజు తల్లిదండ్రులు ధూపాటి వెంకట రాజు, తులసమ్మ జ్ఞాపకార్థం ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ దాత గా సహకరించడం జరిగింది. సుమారుగా 500 మంది ప్రయానికులకు ఈ ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేయటం జరిగింది. ఈ సందర్భముగా మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ ధూపాటి భద్ర రాజు మాట్లాడుతూ వేసవి కాలం దృశ్య ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేయడం చాలా మంచి కార్యక్రమం అని తల్లాడ బస్టాండ్ కంట్రోలర్ లాలయ్య ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేయాలని తీసుకున్న ఈ నిర్ణయం కి ప్రత్యేకంగా అభినందించడం జరిగింది. బస్టాండ్ కంట్రోలర్ లాలయ్య, ప్రయాణికులు, తదితరులు పాల్గొన్నారు.



మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...
తెలుగు దినపత్రిక
07-05-2026

## పెండ్లిమాన్ తాండలో ఘనంగా మారెమ్మ ఊరుదేవర కార్యక్రమం

- మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ ప్రత్యేక పూజలు
- వైయస్సార్ పార్టీ నాయకుల సన్మానం
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న నాయకులు,కార్యకర్తల భక్తులు.





**పత్తికొండ మన జనప్రగతి మే 06:-** పత్తికొండ మండలం పెండ్లిమాన్ తాండ గ్రామంలో మారెమ్మ ఊరుదేవర కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ వైయస్సార్ పార్టీ నాయకులు బాబు నాయక్, చిన్న రంగడు వారు శాలువాతో ఆమెను సన్మానించారు. ఈ పూజ కార్యక్రమంలో మండల కన్వీనర్, ఎంపీపీ, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కమిటీ నాయకులు, జిల్లా కమిటీ నాయకులు, మాజీ సర్పంచులు, కో-ఆప్షన్ మెంబర్, టౌన్ ప్రెసిడెంట్‌తో పాటు అనేక మంది కార్యకర్తలు పాల్గొన్నారు

## ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరినీ ఆదుకొనే ఆపద్బాంధవుడు: మేడిపల్లి సత్యం

**గంగాధర మన జనప్రగతి మే 06:-** కరీంనగర్ జిల్లాచొప్పదండి నియోజక వర్గం మల్యాల మండలం గొల్లపెల్లి గ్రామానికి చెందిన మోతుకు మహేష్ అనారోగ్యం తో బాధపడుతూ వైద్య ఖర్చులకు డబ్బులు లేవు అని స్థానిక నాయకులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కి తెలుపగా తక్షణమే వారు స్పందించి నిమ్స్ ఆసుపత్రి హైదరాబాద్ లో చికిత్స నిమిత్తం ఎనిమిది లక్షల రూపాయిలు (8,00,000/-) ఎల్ ఓ సి ని నేడు వారి కుటుంబ సభ్యులకు అందజేసిన గౌరవ చొప్పదండి శాసన సభ్యులు డా శ్రీ మేడిపల్లి సత్యం .

## ధాన్యము కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన ఎంపీడీవో దమ్మని రాము

**గంగాధర మన జనప్రగతి మే 06:-**కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో ఈరోజు ఆచంపల్లి గ్రామంలో ఎంపీడీవో దమ్మని రామ్ , ఈజీఎస్ సైట్ సందర్శించినారు మరియు ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసినారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆరె తేజశ్రీ రాజశేఖర్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. వీరికి మజ్జిగ ప్యాకెట్లు మరియు ఒఆర్ఎస్ అందజేసినారు.

## పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసిన మామిండ్ల సురేష్



**హన్మకొండ మన జనప్రగతి మే 06:** హనుమకొండ జిల్లా డిసిసి కార్యవర్గ సభ్యునిగా నియమితులైన 31వ డివిజన్ కు చెందిన మామిండ్ల సురేష్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసి శాలువా తో సత్కరించి పూల బొకే అందజేశారు. హనుమకొండ జిల్లా డిసిసి కార్యవర్గ సభ్యునిగా నియమించేందుకు సహకరించినందుకు అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం టిపిసిసి అధ్యక్షులు మహేష్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి,కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఇనుగాల వెంకట్రాం రెడ్డి,మర్యాద పూర్వకంగా కలిసి శాలువా తో సన్మానించారు. ఈ పదవి రావటానికి సహకరించిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఇనుగాల వెంకట్రాం రెడ్డి,బట్టి శ్రీనివాస్,ఇ వి శ్రీనివాసరావు,31 వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు,డివిజన్ కాంగ్రెస్ నాయకులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ...నాకు ఇచ్చిన ఈ పదవి మరింత బాధ్యతను పెంచింది అన్నారు. నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కార దిశగా అడుగులు వేస్తూ పార్టీ ప్రతిష్ట మరియు బలోపేతానికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని పార్టీ ఎప్పుడు పిలిచినా ఏ పని చెప్పినా తూచా తప్పకుండా చేస్తానని చెప్పటం జరిగింది. నాకు ఈ పదవి రావడం వెనక 31 డివిజన్ ప్రజల ఆధార అభిమానాలు ఉన్నాయని అందుకుగాను ప్రజలందరికీ ఎల్లప్పుడు నేను రుణపడి ఉంటాను అని తెలిపారు.

# 11వ డివిజన్ ఎన్టీఆర్ నగర్‌లో పర్యటించిన మంత్రి నారాయణ

- గతంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి ఇప్పుడు జరుగుతోంది
- ఇవేమీ తెలుసుకోకుండా వైఎస్సార్సిపి నేతలు విమర్శలు చేస్తున్నారు
- తప్పుడు ఆరోపణలు చేస్తే అభాసుపాలు కాక తప్పదు
- ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే తిరిగి తీసుకొంటాం: మంత్రి నారాయణ

**నెల్లూరు మన జనప్రగతి మే 06:-** ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ హెచ్చరించారు. కార్పొరేషన్ పరిధిలో ఎక్కడ ఆక్రమణ జరిగినా స్థానికులు సమాచారం ఇస్తే వెంటనే చర్యలు తీసుకొంటామన్నారు. నెల్లూరు సిటీలో అభివృద్ధి



పరుగులందుకుంటోంది. బుధవారం ఉదయం 11వ డివిజన్ ఎన్టీఆర్ నగర్‌లో మంత్రి నారాయణ పర్యటించి, క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇంటిపట్టాల మంజూరుకు కృషిచేస్తానని ప్రతి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. వైఎస్ఆర్సిపి నేతల విమర్శలపై నిప్పులు చెరిగారు. రాష్ట్రవ్యాప్తంగా 14 వేల కోట్లతో మంచినీటి ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయని, త్వరలోనే అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద మరో 14 వేల కోట్లు మంజూరు కానున్నాయని వెల్లడించారు. ముఖ్యంగా నెల్లూరు అభివృద్ధి కోసం 700 కోట్లు కేటాయించాలని కోరినట్లు తెలిపారు. గతంలో ఎన్నడూ లేనంత నిధులు రాబట్టి అభివృద్ధి చేస్తుంటే వాస్తవాలు తెలుసుకోకుండా వైసీపీ నేతలు బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు, దారినపోయే దానయ్యలు ఇచ్చే సమాచారంతో తప్పుడు ఆరోపణలు చేస్తే అభాసుపాలు కాక తప్పదని హెచ్చరించారు. RTI ద్వారా రాయల్‌గా సమాచారం సేకరించి వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని విపక్షాలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేయర్ సుజాతా అశోక్,రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మెన్ అబ్దుల్‌అజీజ్,డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్,ఏడీసీ హేమలత,మాజీ జడ్పిటిసి విజేతా రెడ్డి,టీడీపీ మహిళావిభాగం నేతలు కపిర రేవతి,రాజేశ్వరి,డివిజన్ క్లస్టర్ ఆవుల శ్రీనివాస్,ప్రెసిడెంట్ నాగేంద్ర,టీడీపీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# మహానాడు పనులకు ఘనంగా భూమి పూజ

- చరిత్ర సృష్టించేందుకు సిద్ధమైన సింహపురి నేతలు
- పార్టీ ఆవిర్భావం తర్వాత నెల్లూరులో తొలిసారిగా మహానాడు
- లక్షలాది మంది వచ్చినా ఇబ్బంది లేకుండా ఇఫ్కో సెజ్‌లో మహానాడు
- మే 27 నుంచి మూడు రోజుల పాటు మహానాడు
- కార్యకర్తలకు పండుగ, రాష్ట్రానికి దిశానిర్దేశం

**నెల్లూరు మన జనప్రగతి మే 06:-** తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మక వార్షిక ఉత్సవం మహానాడు నిర్వహణకు నెల్లూరు జిల్లా సిద్ధమవుతోంది. కొడవలూరు మండలం చంద్రశేఖర్ పురం లోని ఇఫ్కో కిసాన్ సెజ్ లో మే 27, 28, 29 తేదీల్లో మూడు రోజుల పాటు జరగనున్న పసుపు పండుగ వేడుకల కోసం బుధవారం ఉదయం 10:22 గంటలకు మంత్రులు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దంపతులు జిల్లా ఎమ్మెల్యేలు,ఎంఎల్సిలు,టీడీపీ ముఖ్య నేతలు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ ఆవిర్భావం తర్వాత నెల్లూరులో



తొలిసారిగా రాష్ట్ర స్థాయి మహానాడు జరుగుతుండటంతో, దీనిని అత్యంత వైభవంగా, చారిత్రాత్మకంగా నిర్వహించేందుకు టీడీపీ నేతలు భారీ సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే మహానాడు కార్యకర్తలకు ఒక పెద్ద పండుగ లాంటిదన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు,జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ఆదేశాల మేరకు 2200 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఇఫ్కో సెజ్ ప్రాంతాన్ని వేదికగా ఎంపిక చేశామని తెలిపారు. దీనివల్ల లక్షలాదిగా తరలివచ్చే అభిమానులకు పార్కింగ్, ట్రాఫిక్ సమస్యలు ఉండవని అన్నారు మూడు రోజుల సభల్లో రాష్ట్ర భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే ఎన్నో కీలక నిర్ణయాలు తీర్మానాలు చేయబోతున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని నాయకులందరినీ



సమన్వయ పరుచుకుంటూ సమిష్టి కృషితో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని మంత్రి పేర్కొన్నారు. భూమి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర, ఎమ్మెల్యేలు ప్రశాంతి రెడ్డి,కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి , కురుగొండ్ల రామకృష్ణ,, కావ్యా కృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, పాశం సునీల్,మాజీ మంత్రులు రమేష్ రెడ్డి,పరసా రత్నం,మేయర్ సుజాతా అశోక్, రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్,నుడా చైర్మన్ శ్రీనివాసులురెడ్డి, వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ జెడ్ శివప్రసాద్,రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి,డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ ,టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి,జిల్లా పార్టీ ప్రదాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర్లు రెడ్డి,మాజీ ఎంఎల్సీ లు,పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## నెల్లూరు ప్రగతిపై మంత్రి నారాయణ స్పెషల్ ఫోకస్

- 10 కోట్లతో కపాటిపాళెంలో డ్రైన్ల ఆధునీకరణ .
- ఆరు నెలల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పూర్తి
- సంగం బ్యారేజీ నుంచి ఇంటింటికీ మంచినీరు-జూలై నాటికి లక్ష్యం పూర్తి - మంత్రి నారాయణ





**నెల్లూరు మన జనప్రగతి మే 06:-** ఒక్క రూపాయికే డ్రైనేజీ కనెక్షన్..దోమలు లేని నగరంగా నెల్లూరును తీర్చిదిద్దుతాం. నెల్లూరు నగర అభివృద్ధిపై రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ప్రత్యేక దృష్టి సారించారు. అందులో భాగంగా 51వ డివిజన్ కపాటిపాళెంలో పర్యటించి వీధి వీధి తిరుగుతూ డ్రైన్లను, ఇంటింటికీ ఉన్న మంచినీటి కుళాయిలను స్వయంగా పరిశీలించారు. డ్రైన్ల ఆధునీకరణ కోసం 10 కోట్ల రూపాయలు కేటాయించడంతో స్థానిక ప్రజలు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. పర్యటనలో సామాన్యుడిలా రోడ్డు పక్కన ఉన్న మహిళ టిఫిన్ సెంటర్‌లో వడలు తిని అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని,550 కోట్లతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను గత ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. ఇప్పుడు మరో కోట్ల రూపాయలతో మళ్ళీ ప్రారంభించామని తెలిపారు. ఆరు నెలల్లో ఈ పనులు పూర్తి చేస్తామన్నారు. జూలై కల్లా అమృత్ స్కీమ్ ద్వారా సంగం బ్యారేజీ నుండి ప్రతి ఇంటికీ మంచినీరు అందిస్తామని హామీ ఇచ్చారు. కేవలం ఒక్క రూపాయికే డ్రైనేజీ కనెక్షన్ ఇస్తున్నామని, ప్రజల సహకారంతో నెల్లూరును దోమలు లేని సుందర నగరంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ దేవరకొండ సుజాత అశోక్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్ళపాక అనురాధ, మాజీ జడ్పిటిసి విజేతారెడ్డి, నగర మహిళా అధ్యక్షురాలు కపిర రేవతి, మాజీ కార్పొరేటర్ దార జయ రాజు ,క్లస్టర్ మిదురి ప్రశాంత్ ,కో-క్లస్టర్ ఇక్బాల్,కమటం ప్రశాంత్ ,ప్రెసిడెంట్ వైస్ ప్రెసిడెంట్ కుంద బాలకృష్ణ, జనరల్ సెక్రటరీ కుమార్ .,ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజేష్,అశోక్ ,స్థానిక టిడిపి జనసేన బిజెపి ముఖ్య నాయకులు పాల్గొన్నారు

## మన జనప్రగతి వార్తకు స్పందన

- వెలమవారిపల్లి పాత దారిలో డ్రైనేజీ సమస్య పరిష్కారం



చెరువును తలపిస్తున్న పులివెందుల వెలమవారిపల్లి పాత రోడ్డు

- మురుగు నీటిలోనే ప్రయాణం, దుర్వాసనతో అవస్థలు
- వ్యాధుల భయంతో స్థానికుల ఆందోళన

**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఏప్రిల్ 24:-**పులివెందుల పట్టణంలోని పాత వెలమవారిపల్లి రోడ్డులో డ్రైనేజీ సమస్య అధ్వానంగా తయారైంది. డ్రైనేజీ మురుగునీరు రోడ్డుపైకి ప్రవహిస్తూ చెరువును తలపిస్తోంది. మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై మురుగునీరు నిలవడంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోంది. నిలిచిన నీటిలో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని, దీనివల్ల డెంగ్యూ,మలేరియా వంటి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. డ్రైనేజీ మురుగునీరు రోడ్డుపైకి రావడంతో పాదచారులు నడవలేకపోతున్నారు. వాహనదారులు కూడా బురదమయమైన రోడ్డుపై ప్రయాణించడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపల్ సిబ్బంది అప్పుడప్పుడు వచ్చి డ్రైనేజీని మరమ్మత్తులు చేసినప్పటికీ,రెండు రోజుల్లోనే పరిస్థితి మళ్లీ మొదటికి వస్తోందని శాశ్వత పరిష్కారం దిశగా అధికారులు ఆలోచించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. వ్యాధులు వ్యాపించకముందే ఉన్నతాధికారులు స్పందించి,పాత వెలమవారిపల్లి రోడ్డులోని డ్రైనేజీ వ్యవస్థను ప్రక్షాళన చేసి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ఆ ప్రాంత నివాసితులు డిమాండ్ చేస్తున్నారు.

**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మే 06:-**పులివెందుల పట్టణంలోని వెలమవారిపల్లి కు వెళ్లే పాత దారిలో గత కొంతకాలంగా వేధిస్తున్న మురికినీటి నిల్వ మరియు డ్రైనేజీ లీకేజీ సమస్యకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఈ సమస్యపై మన జనప్రగతి పత్రికలో ఏప్రిల్ 24వ తేదీన ప్రచురితమైన కథనానికి స్థానిక నాయకులు మరియు అధికారులు స్పందించారు. రహదారిపై మురికినీరు నిలిచిపోయి,దుర్వాసన వెదజల్లుతు ఉండటంతో ప్రజలు, వాహనదారులు పడుతున్న ఇబ్బందులను గమనించిన టీడీపీ నాయకులు తుగూట్ల మధుసూదన్ రెడ్డి స్పందించారు. బుధవారం ఆయన సంబంధిత అధికారులతో కలిసి ప్రభావిత ప్రాంతాన్ని సందర్శించారు. యుద్ధప్రాతిపదికన పనులు ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని,మధుసూదన్ రెడ్డి తక్షణమే మున్సిపల్ డ్రైనేజీ క్లీనింగ్ ట్యాంకర్ ద్వారా నిలిచిపోయిన మురికినీటిని,పూడికను తొలగింపజేశారు. పాత దారిపై ఉన్న గుంతలను జెసిబి సహాయంతో మట్టితో నింపి,లెవలింగ్ చేయించి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మునికుమార్,మున్సిపల్ రాజు సమన్వయంతో పనులను పర్యవేక్షించారు. వీరితో పాటు యమహా షోరూం అధినేత చాంద్ బాషా,షైక్ అక్రమ్ తదితరులు పాల్గొని పనులను త్వరితగతిన పూర్తి చేయించారు. నిత్యం నరకప్రాయంగా మారిన ఈ రహదారిపై మన జనప్రగతి పత్రిక స్పందించి వార్త రాయడం,దానికి స్పందించి మధుసూదన్ రెడ్డి మరియు అధికారులు పనులు చేపట్టడం అభినందనీయం అని స్థానిక నివాసితులు సంతోషం వ్యక్తం చేశారు.



# నమో నారసింహ నామస్మరణతో మారుమోగిన పెన్నహోబిలం

**ఘనంగా జరిగిన బ్రహ్మరథోత్సవం**

**పల్లకిని మోసిన మంత్రి**

**వినయానికి ప్రశంసలు**


**వేదమంత్రాలతో ఆధ్యాత్మిక వాతావరణం**

**వేలాదిగా తరలివచ్చిన భక్తులు**









**ఉరవకొండ మన జనప్రగతి మే 06:-**అనంతపురం జిల్లా దక్షిణ భారతంలో 'రెండవ అహోబిలం'గా ప్రసిద్ధి చెందిన పెన్నానది తీరంలోని పవిత్ర పుణ్యక్షేత్రం పెన్నహోబిలంలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తి, వైభవాలతో అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం నిర్వహించిన మడుగు రథోత్సవం, దివ్య బ్రహ్మరథోత్సవం భక్తులను పరవశింపజేశాయి. ఉదయం సూర్యోదయంతోనే ఆలయ ప్రాంగణం వేద మంత్రోచ్చారణలతో మారుమోగింది. స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించిన అనంతరం ఉదయం 9 గంటలకు పుష్పాలతో అలంకరించిన మడుగు రథంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు పాల్గొని భక్తి పారవశ్యంలో మునిగిపోయారు.రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ స్వామివారికి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అధికారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి వినయంగా మాట్లాడుతూ, "నేను మంత్రినైనా, స్వామివారి సేవలో కేవలం ఉరవకొండ నంబర్ వన్ కూలీనే" అని చెప్పి స్వయంగా పల్లకిని భుజాన మోసి తన భక్తిని చాటుకున్నారు.సాయంత్రం 4 గంటలకు శుభముహూర్తంలో శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి వారు సర్వాలంకార భూషితులై దివ్య బ్రహ్మరథంపై కొలువుదీరారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ బ్రహ్మరథం మాడవీధుల్లో సాగుతుండగా భక్తులు 'గోవింద' నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నింపేశారు. రథచక్రాన్ని దర్శించుకుంటే జన్మజన్మల పాపాలు తొలగిపోతాయన్న విశ్వాసంతో భక్తులు వేలాదిగా తరలివచ్చారు. పెన్నహోబిలం భక్తజన సముద్రంగా మారింది. ఈ మహోత్సవంలో మంత్రి పయ్యావుల కేశవ్‌తో పాటు రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాస్, దేవస్థాన చైర్మన్ రేగటి నాగరాజు, ఈవో రమేష్ బాబు, టీడీపీ నేత విజయ్ భాస్కర్, జనసేన ఇంచార్జి గౌతమ్, మోపిడి గోవిందు, పెద్ద ముస్తూరు బోస్ తదితరులు పాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని చలువ పందిళ్లు, చల్లని తాగునీరు, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆరోగ్య సేవల కోసం హెల్త్ క్యాంపులు, రవాణా సౌకర్యంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపింది. భక్తులు తలనీలాలు సమర్పించి తమ మొక్కుబడులు చెల్లించుకోగా, పెన్నానది తీరం 'నమో నారసింహ' నామస్మరణతో మారుమోగింది.

## నిమ్మకాయల వీధిలో భక్తులకు అంబలి పంపిణీ..



**తిరుపతి మన జనప్రగతి మే 06:**కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుమల శ్రీవారి సోదరిగా, తిరుపతి నగర ప్రజల గ్రామదేవతగా, పిలిస్తే పలికే తల్లిగా నిత్యం పూజలు అందుకుంటున్న శ్రీ తాతయ్యగుంట గంగమ్మ జాతర మంగళవారం చాటింపుతో ప్రారంభం కావడంతో బుధవారం నిమ్మకాయలవీధిలో భక్తులకు అంబలి పంపిణీ కార్యక్రమానికి బిజెపి నేత నవీన్ కుమార్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు, తిరుపతి కో-ఆపరేటివ్ బ్యాంకు మాజీ డైరెక్టర్ పి. భువన్ కుమార్ రెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరై భక్తులకు వితరణ చేశారు. ఈ సందర్భంగా నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ శ్రీ తాతయ్య గుంట గంగమ్మ జాతరను పురస్కరించుకొని గత 25 సంవత్సరాలుగా నిమ్మకాయలవీధిలో మునస్వామి ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతున్నదని, ఈ సంవత్సరం మునస్వామి ఆకాల మరణంతో వారి సోదరి లలిత,నాగేశ్వరరావు, షణ్ముగం,నాగార్జున,దేవి,లక్ష్మి లతోపాటు నిమ్మకాయలవీధి, తీర్థకట్టవీధిలోని వ్యాపారస్తుల సహకారంతో ఏడు రోజులపాటు ప్రతిరోజు ఒక పూట గంగమ్మ తల్లికి నైవేద్యం పెట్టి భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు జరుగుతాయని తెలియజేశారు. అనంతరం టిడిపి నేత పి. భువన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తాతయ్యగుంట గంగమ్మ తల్లి అనుగ్రహంతో తిరుపతి నగర ప్రజలతో పాటు అన్ని ప్రాంతాల ప్రజలు సుభిక్షంగా ఉండాలని, సకాలంలో వర్షాలు పడాలని, ఎటువంటి అంటువ్యాధులు, విష జ్వరాలు నగరంలో ప్రబలకుండా ప్రజలంతా సుఖసంతోషాలతో ఆరోగ్యంగా ఉండాలని గంగమ్మ తల్లికి నైవేద్యం పెట్టి హారతి ఇచ్చి ఘనంగా పూజలు నిర్వహించారు! ఈ కార్యక్రమంలో స్థానిక వ్యాపారస్తులు నాగరాజు,శీను, అరవింద్,గుర్రప్ప,శివ, రూపేష్ పాల్గొన్నారు.

---

# చెత్తాచెదారంతో ఉన్న ఖాళీ స్థలాలకు నోటీసులు ఇచ్చి శుభ్రం చేయించండి

**• స్కూటర్ పై తిరుగుతూ పారిశుధ్య పనులు పరిశీలించిన ఇంచార్జి కమిషనర్ శారదా దేవి**





**తిరుపతి మన జనప్రగతి మే 06:-** నగరంలో చెత్తాచెదారంతో ఉన్న ఖాళీ స్థలాలకు నోటీసులు ఇచ్చి శుభ్రం చేయించాలని, లేకుంటే జరిమానాలు విధించాలని నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ శారదా దేవి అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం నగరంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను అధికారులు, సిబ్బందితో కలసి వెళ్లి పరిశీలించారు. కొన్ని ప్రాంతాలకు ఇంచార్జి కమిషనర్ స్వయంగా స్కూటర్ పై వెళ్లి పారిశుధ్య పనులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో చెత్తచెదారం వేయడం వలన అపరిశుభ్రంగా ఉందని తెలిపారు. దీంతో దోమలు పెరిగి, అపరిశుభ్రతతో చుట్టుపక్కల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వెంటనే శుభ్రం చేయాలని స్థల యజమానులకు నోటీసులు ఇవ్వాలని, లేదా జరిమానాలు విధించి శుభ్రం చేయించాలని అధికారులకు సూచించారు. డ్రైనేజి కాలువల్లో చెత్త నిలబడకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని తెలిపారు. అక్రమ నిర్మాణాలను ముందే గుర్తించి అడ్డుకోవాలని, ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తులు పరిష్కరించాలని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. ఇంచార్జి కమిషనర్ వెంట ఆరోగ్య శాఖ అధికారులు, ఏసీపీ లు, స్వర్ణ వార్డు కార్యదర్శులు, తదితరులు ఉన్నారు.

# హైదరాబాద్‌లో గోవధ నిరోధానికి చర్యలు తీసుకోవాలి




**హైదరాబాద్ మన జనప్రగతి మే 06:-** బక్రీద్ పండుగ సందర్భంగా హైదరాబాద్ నగరంలో గోవధ నిరోధానికి తగిన చర్యలు తీసుకోవాలని లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ ట్రస్టీ రిధేష్ జాగీర్దార్ ఆధ్వర్యంలో ప్రతినిధులు బుధవారం నగర సీపీ విసి సజ్జనార్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ మెమోంటోను బహుకరించి సజ్జనార్ ను సత్కరించారు. నగరంలో గోవధ నిరోదక చట్టం సమర్థవంతంగా అమలయ్యే విధంగా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు. గోవధతో తెలంగాణలో వాటి సంతతి తగ్గిపోతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గో సంరక్షణ సంస్థల ప్రతినిధులు రితీష్ జాగీర్దార్, ప్రవీణ్ పాండ్య, జస్రాజ్ శ్రీమల్, మురళీమనోహర్ పలోడ్, దీపక్ సింగ్, ఎ.బాలక్రిష్ణ, శ్రీకాంత్, బి.నరసింహ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# కురుమ సంఘం ప్రతిష్టను దెబ్బతీస్తే ఊరుకునేది లేదు

**• రాష్ట్ర అధ్యక్షులు ఎగ్గే మల్లేశం కురుమ**




**హైదరాబాద్ మన జనప్రగతి మే 06:-**కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి 18 సంవత్సరాలలో పలు ప్రధాన ఆలయాల వద్ద వసతి గృహాలు, ముస్లిం జంగ్ పుల్, వంతెన వద్ద విద్యార్థి వసతి గృహం, ఇలా దాదాపు రెండు వేల కోట్ల రూపాయల ఆస్తులను కూడబెట్టగలిగినట్లు రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షులు, సంఘం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం పేర్కొన్నారు. సోమాజిగూడ లోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొందరు ఈ మధ్యకాలంలో సామాజిక మాధ్యమాల ద్వారా కురుమ సంఘం ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని ఆయన హితవు పలికారు. కురుమ సంఘం, రాష్ట్రంలోని కురుమల అభ్యున్నతి కోసం తాము ఎంతో పాటుపడుతున్నామని తెలిపారు. ముస్లిం జంగ్ వంతెన వద్ద ఉన్న కురుమ సంఘం భవనాన్ని సంఘానికి చెందిన ఓ నాయకుడు నేలమట్టం చేస్తే కురుమలు ఏ సమావేశం నిర్వహించుకోవాలన్నా నిలువ నీడ లేకుండా పోయిందన్నారు. తాను సొంతంగా 50 లక్షలు అదేవిధంగా సంఘం ద్వారా నిర్వహించిన చీటీల తో 40 లక్షల రూపాయలు వచ్చాయన్నారు. ఆ నిధులతో భవన నిర్మాణం పూర్తి చేసుకోగా ప్రస్తుతం అద్దె లభిస్తుందన్నారు. 2008 సంవత్సరంలో ఆనాటి కురుమ పెద్దలు తనను కురుమ సంఘం అధ్యక్షుడిగా ఉండాలని కోరగా తాను ఎన్నికలలో పోటీ చేసి వచ్చాను తప్ప దొడ్డిదారిన రాలేదన్నారు. అదే విధంగా యాదాద్రి, కొమురవెల్లి లలో దాతల సహకారంతో స్థలాన్ని కొనుగోలు చేసి వసతి గృహాలను నిర్మించినట్లు వివరించారు మన్సూరాబాద్ లో మూడు ఎకరాల 10 గుంటల స్థలంలో 2014 సంవత్సరంలో బిర్లా ఓపెన్ మైండ్ ఓపెన్ మైండ్స్ పాఠశాల నిర్మాణాన్ని చేపట్టడం జరిగిందన్నారు అయితే పాఠశాల భవన నిర్మాణం కోసం నాటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావుల సహకారంతో దాదాపు కోటి రూపాయలకు పైగా భవన నిర్మాణ ఫీజును మినహాయింపు తీసుకోవడం జరిగిందని వివరించారు. ప్రస్తుతం ఆ భవనం నుంచి ప్రతినెల అద్దె వస్తుందని తెలిపారు. అప్పటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావును కలిసి తమకు వసతి గృహం కోసం స్థలము, నిర్మాణ ఖర్చులు కావాలని విజ్ఞప్తి చేయగా ఆయన కోకాపేటలో 10 ఎకరాల స్థలము 10 కోట్ల రూపాయల నిధులను కురుమ గొల్లల కోసం విడుదల చేశారన్నారు. అయితే ఇద్దరు కలిసి కడితే ఇబ్బందులు వస్తాయని అప్పటి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తో చర్చించి కురుమలకు ఐదు ఎకరాలు ఐదు కోట్లు, యాదవులకు 5 ఎకరాలు ఐదు కోట్లు గా విభజించి రెండు భవనాలను నిర్మించినట్లు తెలిపారు. అదే విధంగా కురుమల భవనాన్ని ఇప్పటికే శంకుస్థాపన చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ద్వారా శంకుస్థాపన జరిపి స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ఇప్పటివరకు ఏ కులస్తుల భవన నిర్మాణం కూడా పూర్తిచేసే స్థితిలో లేదని, తాము మాత్రం భవనాన్ని నిర్మించి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఆ భవనంలో విద్యార్థులకు వసతి హాస్టల్ ఏర్పాటు చేయాలని పరిశీలించామని, అదేవిధంగా ఇంజనీరింగ్ కళాశాల, ఐఏఎస్ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని మేధావులతో చర్చిస్తే ఇంత దూరం విద్యార్థులు రావడం కష్టమని అందరు సూచనలు చేశారని దీనిని దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాంతంలో నారాయణ ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు కోసం నిర్మాణం చేస్తే నెలకు 90 లక్షల చొప్పున అద్దె వస్తుందని వచ్చిన అద్దెతో రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో కురుమ సంఘం బ.ీవనాలం నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసుకునేందుకు నిద.ీలం ఉపయోగించవచ్చని నిర్ణయానికి రావడం జరిగింది అన్నారు. కానీ ఇవన్నీ ఏమీ తెలియని కొందరు సంఘం గురించి రకరకాలంగా మాట్లాడడం మంచి పద్ధతి కాదన్నారు. కుల ప్రతిష్టను దిగ జార్చేలా వ్యవహరిస్తే కులజులు ఊరుకోరని తెలిపారు. ఆయా వ్యవహారాలను పూర్తిగా ట్రస్ట్ బోర్డు చూసుకుంటుందని ఎప్పటికప్పుడు ట్రస్టు బోర్డులో లెక్కలు చూస్తారని అయినప్పటికీ ఎవరికైనా అనుమానాలు ఉంటే సంఘం కార్యాలయానికి వస్తే వారికి అన్ని చూపించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. రాష్ట్ర కురుమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ క్యామ మల్లేశం మాట్లాడుతూ కురుమ సంఘం భవనం లో సమావేశాలు నిర్వహించుకునేందుకు నిలువ నీడలేని పరిస్థితిలో రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షునిగా పదవి బాధ్యతలు స్వీకరించిన ఎగ్గే, మల్లేశం నేడు 2000 కోట్ల రూపాయల విలువ చేసే ఆస్తులను పోగు చేయడం అభినందనీయమని తెలిపారు. ఆయన నిక్కచ్చిగా సంఘం అభ్యున్నతికి ఎంతో పాటు పడ్డారని కొనియాడారు. కురుమ సంఘం మీడియా కమిటీ చైర్మన్ చీర శ్రీకాంత్ మాట్లాడుతూ కురుమల అభ్యున్నతికి ఎగ్గే,మల్లేశం ఎంతో పాటు పడుతున్నారని కానీ కొందరు కురుమ కులస్తులమని చెబుతూ కురుమల ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కుల ప్రతిష్టను కాపాడాల్సింది పోయి దెబ్బతీసేలా ప్రయత్నిస్తే బాగుండదన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు బండారి నారాయణ కొలుపుల నరసింహ తూముకుంట అరుణ్ కుమార్ రెక్కల కొండల రాజ్ కే,శ్రీనివాస్, , టి బాలమని, ఎం,విజయలక్ష్మి, కోటి గీత, మిర్యాల విజయ , కాలే అమర్నాథ్,తదితరులు పాల్గొన్నారు

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
07 -05-2026

## సక్సెస్ స్టోరీ

# కరువుపై కడప జిల్లా 'జల' విజయం

**• జలధారతో చిగురిస్తున్న ఆశలు.. జలహారతితో మురుస్తున్న రైతన్న! • మారుతున్న జిల్లా రూపురేఖలు • 621 చెరువుల (98%) పునరుద్ధరణ ప్రణాళికలు • 76,983 నీటి సంరక్షణ నిర్మాణాలను శ్రీకారం • 212 (ట్యాంక్ బెడ్లు)-చెరువు పూడికతీత పనులతో చెరువుల నీటి నిల్వ సామర్థ్యం రెట్టింపు • 190 చెరువుల గట్లను బలోపేతం • 188 తూములు, 135 అలుగుల మరమ్మతులతో పాత సాగునీటి వ్యవస్థకు కొత్త జీవం • 266 గ్రామాల్లో రైతు సంఘాల పర్యవేక్షణలోనే పనులు జరుగుతుండటంతో పారదర్శకతకు పెద్దపీట**

**కడప మన జనప్రగతి మే 06:-** వైఎస్ఆర్ కడప జిల్లాలో సాగునీటి రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటు న్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమం 'జలధార-జలహారతి' ద్వారా జిల్లాలోని చెరువులు, కుంటలు పునరుజ్జీవం పోసుకుంటున్నాయి.రాయలసీమ గుండెకాయ కడప జిల్లాలో జలకళ ఉట్టిపడుతోంది. దశాబ్దాలుగా జిల్లాను వెన్నాడుతున్న కరువు రక్కసిని తరిమికొట్టేందుకు జిల్లా యంత్రాంగం సరికొత్త వ్యూహంతో ముందుకు సాగుతోంది. జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి దిశానిర్దేశంలో 'జలధార-జలహారతి' పథకం అద్భుతంగా రూపుదిద్దుకుంటోంది. సాగునీటి శాఖ అధికారుల సమన్వయంతో క్షేత్రస్థాయిలో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. **అసాధ్యం సుసాధ్యం!** ఒకప్పుడు నీటి కోసం ఎడతెగని నిరీక్షణ ఉన్న చోట, నేడు ప్రణాళికాబద్ధమైన పనులతో భూగర్భ జల నిధిని పెంచుతున్నారు. కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తుండటంతో, సాగునీటి శాఖ అధికారులు



యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేస్తున్నారు. **మైలురాయి:98 శాతం చెరువుల పునరుద్ధరణ ప్రణాళికలు పూర్తి** జిల్లాలోని సాగునీటి వనరులకు ఊపిరి పోయడంలో జిల్లా యంత్రాంగం రికార్డు సృష్టించింది. **లక్ష్యం:** 633 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు. **సాధన:** ఇప్పటికే 621 చెరువుల (98%) పునరుద్ధరణ ప్రణాళికలు సిద్ధం చేసి, పనుల అమలుకు శ్రీకారం చుట్టారు. ఇది రాష్ట్రంలోనే అత్యుత్తమ పురోగతిలో ఒకటిగా నిలుస్తోంది. **భూగర్భంలో 'జల నిధి': దాదాపు 77 వేల కొత్త నిర్మాణాలు** కేవలం చెరువులనే కాకుండా, భూమి పొరల్లో నీటి నిల్వను పెంచడానికి భారీ ప్రణాళిక సిద్ధమైంది. **భారీ లక్ష్యం:** జిల్లా వ్యాప్తంగా 76,983 నీటి సంరక్షణ నిర్మాణాలను (ఔజ క్‌తీబష్‌బతీవం) చేపట్టాలని నిర్ణయించారు. **గ్రామ విప్లవం:** 828 గ్రామాల్లో చెక్ డ్యామ్‌లు, ఇంకుడు గుంతలు మరియు కందకాల ద్వారా వర్షపు నీటిని 'బ్యాంకు'లో దాచినట్లు భూమిలో భద్రపరుస్తున్నారు. **ఉపాధికి ఆసరా - రైతుకు భరోసా** ఈ జల ధార ప్రాజెక్టును మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో (MGNREGS) అనుసంధానం చేయడం వల్ల రెట్టింపు ప్రయోజనం కలుగుతోంది. ఇప్పటికే 688 పనులు మంజూరై వేగంగా సాగుతున్నాయి.గ్రామీణ ప్రాంత కూలీలకు చేతినిండా పని దొరుకుతుండగా, రైతులకు శాశ్వత సాగునీటి భరోసా లభిస్తోంది. **క్షేత్రస్థాయిలో అద్భుత ప్రగతి: నాడు పూడిక నేడు నీటి నిల్వ:** 398 ఫీడర్ ఛానల్స్, 212 (ట్యాంక్ బెడ్ల)చెరువు



పూడికతీత పనులతో చెరువుల నీటి నిల్వ సామర్థ్యం రెట్టింపు అయ్యింది. **కట్టల రక్షణ:** 190 చెరువుల గట్లను బలోపేతం చేసి, భవిష్యత్ వరదలను తట్టుకునేలా తీర్చిదిద్దుతున్నారు. **ఆధునీకరణ:**188 తూములు, 135 అలుగుల మరమ్మతులతో పాత సాగునీటి వ్యవస్థకు కొత్త జీవం పోశారు. **సాగునీటి సంఘాలే 'జల' సైనికులు** "సాగునీటి సంఘాల బాధ్యత" నినాదంతో రైతులను ఈ యజ్ఞంలో భాగస్వామ్యం చేయడం జిల్లా కలెక్టర్ గొప్ప వ్యూహం. జిల్లాలోని 266 గ్రామాల్లో రైతు సంఘా





ల పర్యవేక్షణలోనే పనులు జరుగుతుండటంతో పారదర్శకతకు పెద్దపీట వేసినట్లయ్యింది. **జిల్లాను జలసిరి గడప'గా మారుస్తాం."** "జలధార-జలహారతి ద్వారా పడే ప్రతి వర్షపు చుక్కను భూమిలోకి పంపి, భవిష్యత్ తరాలకు జలనిధిని అందించడమే మా సంకల్పం. కడపను కరువు రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా మేము చేస్తున్న ఈ కృషికి ప్రజల సహకారం మరువలేనిది. ఇప్పటికే 76 పనులు ముమ్మరంగా సాగుతున్నాయి, అతి త్వరలోనే మిగిలిన పనులను కూడా పూర్తి చేసి జిల్లాను 'జలసిరి గడప'గా మారుస్తాం."డా.శ్రీధర్ చెరుకూరి, జిల్లా కలెక్టర్, వైఎస్ఆర్ కడప.

# అలిపిరి వద్ద శాశ్వత యాగశాల నిర్మాణం - విద్య, వైద్య సేవల విస్తరణపై టీటీడీ దృష్టి

**ధర్మకర్తల మండలి సమావేశంలో కీలక నిర్ణయాలు**

**తిరుమల అభివృద్ధికి వందల కోట్ల రూపాయల ఆమోదం**

**భక్తులకు సౌకర్యాలు,ఉద్యోగులకు సంక్షేమ చర్యలు**

**తిరుమల మన జనప్రగతి మే 06:-** తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ధర్మకర్తల మండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.టీటీడీ ఛైర్మన్ బీ ఆర్ నాయుడు అధ్యక్షతన మంగళవారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో సమావేశం జరిగింది.ఈ సమావేశంలో భక్తుల సౌకర్యాలు, ఆలయాల అభివృద్ధి, విద్యావైద్య రంగాల విస్తరణపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.అలిపిరి వద్ద రూ.4.75 కోట్ల వ్యయంతో శ్రీనివాస దివ్యానుగ్రహ హోమం కోసం శాశ్వత యాగశాల నిర్మాణానికి బోర్డు ఆమోదం తెలిపింది. అలాగే అలిపిరి టోల్ గేట్ వద్ద వాహన రద్దీ తగ్గించేందుకు బస్సుల తనిఖీల కోసం శాశ్వత షెల్టర్ల ఏర్పాటు కూడా నిర్ణయించారు.తిరుమలలో భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించే దిశగా సర్వదర్శనం క్యూలైన్లలో రూ.4.55 కోట్లతో అదనపు మరుగుదొడ్లు నిర్మించనున్నారు. రోడ్లు, సర్కిళ్లకు ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన పేర్లు పెట్టేందుకు ఆమోదం



లభించింది.విద్యా రంగంలో టీటీడీ విద్యా సంస్థలకు అత్యాధునిక సదుపాయాల కోసం అదనంగా రూ.43.40 కోట్లు మంజూరు చేశారు. గతంలో కేటాయించిన నిధులతో కలిపి మొత్తం రూ.161.40 కోట్లు విడుదల చేయనున్నారు.నీటి వృథాను నివారించేందుకు గోగర్భం డ్యామ్ నుండి ఫిల్టర్ ప్లాంట్ వరకు రూ.6 కోట్లతో కొత్త పైపులైన్ ఏర్పాటు చేయనున్నారు. అలాగే అవసరాల కోసం ఆప్కో, కో-ఆప్టెక్స్ సంస్థల నుండి రూ.44.20 కోట్ల విలువైన వస్త్రాల కొనుగోలుకు ఆమోదం తెలిపారు.ఆధ్యాత్మిక కార్యక్రమాల విస్తరణలో భాగంగా "అక్షర గోవిందం" కార్యక్రమంలో పాల్గొనే చిన్నారులకు ఉచిత కిట్లు అందించనున్నారు. అలాగే వినికిడి లోపం గల 150 మంది పిల్లలకు ఉచితంగా వినికిడి యంత్రాలు ఇవ్వాలని నిర్ణయించారు.రాష్ట్రంలో మరియు ఇతర రాష్ట్రాల్లో ఆలయాల అభివృద్ధికి కూడా ప్రాధాన్యత ఇచ్చారు. అమరావతి, అనంతవరం, ఖమ్మం, నవీ ముంబై ప్రాంతాల్లో ఆలయ నిర్మాణాలు, గోపురాల నిర్మాణాలకు భారీ నిధులు మంజూరు చేశారు.టీటీడీ ఉద్యోగుల సంక్షేమం కోసం హెల్త్ స్కీమ్ పరిధిలో అదనంగా రూ.2 లక్షల రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని నిర్ణయించారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు శ్రీ వారి దర్శనం, లడ్డూ కార్డులు జారీ చేయనున్నారు.అన్ని కార్యాలయాలను ఒకే చోటకు తీసుకురావడానికి నూతన పరిపాలనా భవనం నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. అలాగే దాతల సౌకర్యాలపై విధి విధానాలు రూపొందించేందుకు కమిటీ ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలో టీటీడీ ఈవో జె. శ్రీవేంకటేశ్వరరావు (రవిచంద్ర), అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్ఓ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## గంగమ్మను దర్శించుకున్న ప్రముఖులు..

**తిరుపతి మన జనప్రగతి మే 06:-** శ్రీ తాతయ్యగుంట గంగమ్మ జాతర ను పురస్కరించుకొని బుధవారం పలువురు ప్రముఖులు గంగమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. కర్నూలు జిల్లాకు చెందిన ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, గౌరు వెంకటరెడ్డి దంపతులు ఆలయం వద్దకు చేరుకోగానే ఆలయ చైర్మన్ మైనారు మహేష్ యాదవ్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం వారికి అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. వారితో పాటు టిటిడి పాలకమండలి సభ్యులు, జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. ఆయనకు చైర్మన్ మహేష్ యాదవ్ శాలువతో సత్కరించి అమ్మవారి ప్రసాదా లను అందజేశారు. **బైరాగి వేషంతో అమ్మవారికి మొక్కులు...** గంగ జాతరలో భాగంగా బుధవారం భక్తులు బైరాగి వేషంలో చిన్న పెద్ద అనే తారతమ్యత లేకుండా అందరూ ఆలయంలో ప్రదర్శనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పాలకమండలి అన్ని ఏర్పాట్లు చేశారు.

# బాల కార్మికుల వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలి: మంత్రి సత్య కుమార్

**• బాలల హక్కుల ప్రత్యేక పరిరక్షణకు కృషి:చైర్మన్ వేటుకూరి**

**కాకినాడ మన జనప్రగతి మే 06:-**బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించి వారిని అభివృద్ధిలో తీసుకురావడమే లక్ష్యంగా కమిషన్ పనిచేయాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి వై సత్య కుమార్ ఆకాంక్షించారు. ప్రస్తుతం జనాభా తగ్గిపోతుందని జనాభా లెక్కలు దక్షిణాదిన తక్కువగా ఉన్నాయని మంత్రి చెప్పారు. బుధవారం రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ వేటుకూరి సూర్యనారాయణ రాజుకు కాకినాడలోని గోదావరి కళాక్షేత్రంలో పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి వై సత్య కుమార్ ఆసక్తికరంగా మాట్లాడారు. ప్రస్తుతం జనాభా తగ్గిపోతుందని అందువల్ల జనాభా పెంచే విషయంలో ప్రజలు నిబంధనలు అనుసరించాలని సూచించారు. బాలల హక్కుల పరిరక్షణ విషయంలో ఎటువంటి రాజీ పడవద్దని వారిని రేపటి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే విధంగా కమిషన్ సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్పొరేట్ రంగంలో బాలల కోసం 25% విద్యా హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని




సత్యకుమార్ సూచించారు. నూతన చైర్మన్ గా పదవి చేపట్టిన వేటుకూరి సూర్యనారాయణరాజు మాట్లాడుతూ కమిషన్ చైర్మన్ నిమిత్తం 390 మంది తమ దరఖాస్తులను దాఖలు చేశారని అందరూ తనను ఎంపిక చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేశారనీ. బాలలకు అందుతున్న పథకాలు క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ఈ కమిషన్ పనిచేస్తుందన్నారు. అలాగే రాష్ట్రంలో ఉన్న కమిషన్ పరిరక్షణ నిమిత్తం ఉన్న సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కారం దిశగా పని చేస్తానని చెప్పారు. ప్రస్తుత వ్యవస్థలో కింది స్థాయిలో సరైన సౌకర్యాలు లేవని వాటిని అందించడమే ధ్యేయంగా కమిషన్ పనిచేస్తుందన్నారు. సంక్షేమ కార్యక్రమాలు




అమలు చేయించేందుకు అందరూ కలిసి పని చేస్తామని వేటుకూరి చెప్పారు. అనంతరం చైర్మన్ వేటుకూరిని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు చల్లా మధుసూదన్ రావు, ప్రేమలత, నాగ మానస, ఉండవల్లి గాంధీ బాబు,ఇంకా ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, విప్ దాట్ల సుబ్బరాజు, మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీఎస్ఎన్ వర్మ, అయ్యా జి వేమా, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, ముత్తా నవీన్, బిక్కిన విశ్వేశ్వరరావు, చైతన్య రాజు, ఎస్వీఎస్ అప్పలరాజు, ఎనిమిరెడ్డి మాలకొండయ్య, తుమ్మల పద్మ, పైడా కృష్ణమోహన్, యాళ్ళ దొరబాబు, గట్టి సత్యనారాయణ, నల్ల పవన్, కంబాల శ్రీనివాసరావు, యార్లగడ్డ రామ్ కుమార్, సాలగ్రామ లక్ష్మీ ప్రసన్న, నురుకుర్తి వెంకటేశ్వర రావు, ఆకుల వెంకటరమణ, కే బీమ శేఖర్, చక్క రమేష్, గౌతు చిన్న, తదితరులు పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174